ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
మంగళవారం 17 సెప్టెంబరు 2024



ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 25.0



ముంపులోనే కొవ్వాడలంక రోడ్డు

ముంపులోనే లంక గ్రామాలు

కైకలూరు/మండవల్లి/ఏలూరు రూరల్, సెప్టెంబరు 16 : కొల్లేటిలంక గ్రామాలు పది రోజులుగా ముంపు నీటిలోనే మునిగి ఉన్నాయి. రహదారులు ముంపు నీటి నుంచి ఇంకా తేరుకోలేదు. కొల్లేరు నీటిమట్టం క్రమేపీ తగ్గుదల పట్టినా లంకగ్రామాల్లో నీరు పూర్తిస్థాయిలో తగ్గలేదు. రహదారులు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. మరో వారం రోజుల పాటు ముంపు నీటిలోనే అవస్థలు తప్పవని ఆయా గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. మండవల్లి మండలంలోని పెద్దఎడ్లగాడి నుంచి పెనుమాకలంకకు, కైకలూరు మండలం పెంచికలమర్రు నుంచి పందిరిపల్లిగూడెం, గుమ్మళ్ళపాడు, శృంగవర ప్పాడు గ్రామాలకు పడవ ప్రయాణం తప్పడం లేదు. నిత్యావసర వస్తువులు, మంచినీళ్ల కోసం ఈ పడవల్లోనే దూర ప్రాంతాలకు వెళ్లి అవస్థలు పడుతూ తిరిగి స్వగ్రా మాలకు చేరుతున్నారు. నందిగామలంక, ఇంగిలిపాక లంక, శ్రీరామ్‌నగర్ గ్రామాల ప్రజల నీటిలోనే అవస్థలు పడుతున్నారు. కైకలూరు మండలం సోమేశ్వరం నుంచి కొల్లేటికోటకు వెళ్లే రహదారిలో నీటి ప్రవాహం కొద్దిమేర తగ్గినా రోడ్డు కోతకు గురై ప్రజలు ప్రయాణించలేని పరిస్థితి. ఇంకా రోడ్లపై నాలుగు అడుగులమేర నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు పడవల్లోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఏలూరు రూరల్ మండలంలోని మొండి కోడు-గుడివాకలంక, రహదారిపై ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తోంది. పది రోజులుగా రహ దారిపై నాలుగు అడుగులకు పైగా వరద ప్రవాహం కొనసాగుతోంది. రహదారిపై రాకపోకలను పూర్తిగా నిషేధించారు. పడవల పైనే గ్రామస్థులు రాకపోకలు కొనసాగిస్తు న్నారు. సోమవారం స్వల్పంగా వరద ఉధృతి తగినా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పూర్తిస్థాయి నీటిమట్టం తగ్గిన తర్వాతే రాకపోకలు సాగించాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

ఇరవై రోజుల్లోనే ఆరుగురికి.. మెమోలు, షోకాజ్ నోటీసులు

- కొరడా ఝుళిపిస్తున్న కొత్త కమిషనర్

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 16 : ఏలూరు నగర పాలక సంస్థ నూతన కమిషనర్ ఎ.భాను ప్రతాప్ కొరడా ఝుళిపిస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సిబ్బంది పని తీరును గాడిలో పెట్టడానికి పూనుకున్నారు. గత నెల 24న బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన సరిగ్గా పని చేయని సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తు న్నారు. విధుల్లో చేరిన ఇరవై రోజుల్లోనే ఆరుగురు సిబ్బంది పనితీరు సరిగా లేదని మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో మిగిలిన సిబ్బంది గాడిన పడినట్టు తెలుస్తోంది. ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్లు షేక్ రఫీ, సాయిలతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, మరో ముగ్గురు మేస్త్రీలకు ఇటీవల కమిషనర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఏఈ రఫీ ఫీల్డ్‌లో అందుబాటులో ఉండడం లేదని, ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ విధులు సరిగా నిర్వర్తించడం లేదని, సచివాలయ సెక్రటరీలపై సరిగా పర్యవేక్షణ లేని కారణంగా ఎందుకు క్రమశిక్షణా చర్యలు తీసుకో రాదంటూ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. 24 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వని పక్షంలో చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. మిగిలిన వారికి కూడా సీసీఏ రూల్స్ ప్రకారం క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసు కోకూడదో సంజాయిషీ కోరారు. కమిషనర్ వచ్చిన వారం రోజుల్లోనే సిబ్బందికి దిశా, నిర్దేశం చేశారు. సరిగా పని చేయని వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ముందే హెచ్చరించారు. గత పది రోజుల నుంచి వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. మరలా వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. పూర్తి స్థాయిలో మళ్లీ మంగళవారం నుంచి కమిషనర్ విధులు నిర్వర్తించే అవకాశం ఉంది. దీంతో సిబ్బంది అంతా అలర్ట్‌అయినట్టు తెలుస్తోంది.



బై..బై గణేశా

జిల్లావ్యాప్తంగా సోమవారం గణేశ్ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ఊరేగింపులు వైభవంగా సాగాయి. యువత ఉత్సాహంగా పాల్గొంది. చిత్రంలో నిమజ్జనానికి తరలివెళ్లుతున్న ఏలూరు పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు.

మిలాద్ ఉన్ నబీ..

ఉమ్మడి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహిం చారు. మహమ్మద్ ప్రవక్త స్నేహాన్ని, ఆత్మీయతను, మంచితనాన్ని పంచాడని ఆయన చూపిన దైవిక మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని మతగురువులు సూచించారు. చిత్రంలో గణపవరంలో ప్రత్యేక ప్రార్థనలు.



పోడియం పోయే.. అంతరం తీరె!



ఏలూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో పోడియం తొలగిస్తున్న దృశ్యం

ప్రభుత్వ కార్యాలయాల్లో బ్రిటీష్ పాత రాచరికపు పోకడలను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలోనే తహసీల్దార్లు, ఆర్డీవో కార్యాలయాల్లోని ప్రత్యేక పోడియంను ఎత్తేశారు. తాజాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియంను తొలగించడమే కాకుండా అధికారులకు, ప్రజలకు మధ్య భారీ వ్యత్యాసం ఉండ డానికి వీల్లేదని నిర్దేశించింది.

రిజిస్ట్రేషన్‌శాఖలో సమూల మార్పులు

- పాత వాసనలకు ఇక సెలవ్
- వచ్చేవాళ్లందరిని కాస్తంత చూస్కోండి
- కుర్చీలేసి మంచినీళ్లు అందించండి
- పూర్వపు పోకడలు కన్పించొద్దు
- అధికారికి, ప్రజలకు మధ్య అంతరం ఉంటే కుదరదు
- నేటి నుంచే అమలుకు ప్రభుత్వం ఆదేశం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జిల్లాలో 12కుపైగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ పాత వాసనలకు అను గుణంగానే పోడియంలు ఉండేవి. రిజిస్ట్రార్ కార్యా లయాల్లోకి ప్రవేశించిన వెంటనే ఎత్తైన చెక్కతో కట్టిన ఎరుపు వస్త్రంతో చుట్టి ఉన్న పోడియమే దర్శనం ఇచ్చేది. చాన్నాళ్లుగా ఈ పోడియంలో కూర్చోవడానికి అధికారులు పెద్దగా ఇష్టపడకపోగా తమకు కేటాయిం చిన అధికారిక చాంబర్‌లోనే విధులు నిర్వహిస్తు న్నారు. వీలైతే తప్ప కొంత సమయం పోడియంలోకి వచ్చి నిష్క్రమించేవారు లేకపోలేదు. జిల్లాలో అత్యధి కంగా ఏలూరు, వట్లూరు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనే లావాదేవీల సంఖ్య అత్యధికం. ఈ ప్రాంతంలో భూముల ధరలు ఎక్కువగా ఉండడమే కారణం. స్టాంప్స్ డీఐజీకి ఇంతకుముందు ప్రైవేటు అద్దె భవ నాలనే కార్యకలాపాలకు కేటాయించేవారు. సొంత భవనాలున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోను వచ్చే ప్రజ లకు కూర్చోవడానికి అనువైన ప్రాంతం ఉండేదే కాదు. ఏలూరులో కోట్ల రూపాయలతో కొత్త భవన మైతే నిర్మించారు గాని వాహనాల పార్కింగ్‌కు, వయస్సు పైబడిన వారు తమ వంతు వచ్చేంత వర కు నిరీక్షించడానికి అనువైన సౌకర్యాలు లేవు. ఈ తరహా పరిస్థితే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కనిపించేది. నగదు లావాదేవీలు సబ్ రిజిస్ట్రార్ కార్యా లయం ప్రాంగణంలోనే అత్యధికంగా జరుగుతున్నా ఆ మేరకు సీసీ కెమెరాలు, నిర్దేశిత అధికారుల పర్యవేక్షణ



పోడియం తొలగింపు తర్వాత కొత్తగా కన్పిస్తున్న ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నామ మాత్రమే. కొన్నిచోట్ల ఈ మధ్య కాలంలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలనుకుంటే తాము కోరుకున్నట్టుగా నిర్ణీత సమయంలోనే పూర్తయితే ఒట్టు. ఎందుకంటే రిజిస్ట్రేషన్లకు వచ్చే వారితోపాటు ఒకరిద్దరు సాక్షులు ఉండడం, వీరితోపాటు తోడుగా ఇంకొందరు రావడంతో ఒక రిజిస్ట్రేషన్ పూర్తికావా లంటే సమయం తీసుకోవడం, ఒకానొక సందర్భంలో రిజిస్ట్రేషన్ సమయం నిర్ణీత వ్యవధి దాటినా కొనసా గుతుండడం విశేషం. వీటికితోడు దస్తావేజు లేఖరు లు, వారి వెనుక వచ్చేవారితో హడావుడి కనిపించేది. జగన్ ప్రభుత్వ హయాంలో భూముల లావాదేవీలు పూర్తిగా మందగించడంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఆదాయం తగ్గింది. ఒక్క ఏలూరులోనే ఏడాదికి వార్షిక ఆదాయ లక్ష్యం ఇంతని విధించినా ఆ లక్ష్యాలేవీ ఏనాడూ చేరుకోలేదు. దీనికితోడు లిటిగేషన్ వ్యవహారాలు ఎక్కువగా తొంగి చూడడం మరో కారణంగా భావిస్తున్నారు.

ఇప్పుడేం జరుగుతుందంటే..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కూటమి ప్రభుత్వం మెరుగులు దిద్దుతోంది. ఏళ్ల తరబడి ఆయా కార్యాల యాల్లో కనిపించిన పోడియంలు మంగళవారం నుంచి అదృశ్యమవుతున్నాయి. ఆ మేరకు ప్రభుత్వం శుక్రవారమే దిశ నిర్దేశం చేయగా ఆయా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పోడియం తొలగింపు పనులు సోమ వారం వరకు కొనసాగిస్తూనే ఉన్నారు. పోడియం తొలగించడం ద్వారా ఆయా కార్యాలయాల్లో అత్యధిక భాగం కలిసొచ్చింది. ప్రభుత్వానికి ఎక్కువ ఆదాయం సమకూర్చే శాఖల్లో ఒక్కటైన స్టాంప్స్ అండ్ రిజి స్ట్రేషన్స్ శాఖను దిద్దుబాటు చేయడం, కక్షిదారుల కోసం కనీస సౌకర్యాలు ఉండేలా జాగ్రత్త పడుతున్నా రు. ఈ పరిస్థితి అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మంగళవారం నుంచి కనిపించాలని ప్రభుత్వం ఆదే శాలు జారీ చేసింది. ఏలూరు, వట్లూరు, నూజివీడు, చింతలపూడి, భీమడోలు, కామవరపుకోట, జంగారెడ్డి గూడెం, చింతలపూడి, పోలవరం, కైకలూరు, మండ వల్లి, ముదినేపల్లిల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నా యి. మంగళవారం నుంచి వీటి రూపు రేఖలను కొంత మారుస్తున్నారు. రిజిస్ట్రార్లు, ఆపై స్థాయి అధికా రులు సోమవారం సాయంత్రమే తమ దగ్గరున్న వాస్తవ పరిస్థితులను ఉన్నతాధికారులకు వివరించా రు. తొలిరోజే తమ ఆదేశాల ప్రభావం స్పష్టంగా ఉండాలని ప్రభుత్వం నిర్దేశించిన క్రమంలో ఎలాంటి ఆరోపణలు, విమర్శలు రాకుండా రిజిస్ట్రార్లు జాగ్రత్త పడుతున్నారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలకు కూర్చో వడానికి అనువైన ప్రదేశంతో పాటు తాగునీటి వసతి కల్పించాలనే కోణంలో ఈ ఆదేశాలు ఉన్నా ఇది ఎంత వరకు అమలవుతాదనేది అనుమానమే.

స్టాంప్ పేపర్ల సంగతేంటి..?

సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీలు ఈ నెల 22తో పూర్తి కానున్నాయి. ఈలోపే స్టాంప్‌ల కొరతను తీర్చాలని అత్యధికులు డిమాండ్ చేస్తున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో స్టాంప్స్ ముద్రించే కేంద్రాలకు బకాయి ఉండడంతో ఆ ముద్రణాశాలల నుంచి స్టాంప్ పేపర్ల విడుదల నిలిపి వేశారు. మరికొద్ది రోజుల్లోనే ఈ సమస్య తీరుతుందని భావిస్తున్నా ఇప్పుడున్న పరిస్థి తుల ప్రకారం ఈ సమస్య జటిలం కాబోతుంది.



ఎంపీ మహేశ్ కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గన్ని వీరాంజనేయులు, ఘంటా మురళి, పామాయిల్ రైతులు

ఐదు హామీలు నెరవేర్చా..

- పామాయిల్ దిగుమతి సుంకం పెంపుతో రైతులకు గిట్టుబాటు ధర
- పొగాకు రైతుల నుంచి నిరుద్యోగుల వరకు ఆదుకున్నా..
- ఏలూరులో వందే భారత్ హాల్ట్..పోలవరం నిర్మాణంలో కృషి
- సీఎం చంద్రబాబు సహకారంతోనే ఇదంతా సాధ్యం
- మీడియాతో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

వంద రోజుల్లో ఆరు ముఖ్య హామీల్లో ఐదింటిని సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రుల సహకారంతో నిలబెట్టుకోగలిగానని ఎంపీ మహేశ్ కుమార్ యాదవ్ ప్రకటించారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, పోలవరం టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాసరావు, రాష్ట్ర పామాయిల్ రైతుల అధ్యక్షుడు రాఘవరావు, తెలుగు రైతు అధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావులతో కలిసి మాట్లాడారు. 'వేలాది మంది రైతులు ఎదురు చూస్తున్న పామాయిల్ మద్దతు ధర ఒక నిర్దిష్ట స్థాయికి చేరేలా ఢిల్లీలో నేను చేసిన ప్రయత్నాలన్నీ కొలిక్కివచ్చాయి. పామాయిల్ దిగుమతి సుంకం 25 నుంచి 27.5 శాతం విధింపు ద్వారా రైతులకు అత్యధిక లబ్ధి కలుగుతుం దని కేంద్ర మంత్రులు, కార్యదర్శులతోపాటు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాను. సీఎం నీతి ఆయోగ్ సమావేశంలో దీనిని చర్చించడంతో తగు నిర్ణయం తాజాగా వెలువడింది. ఇది వంట నూనెలను ఉత్పత్తి చేస్తున్న రైతులందరికీ ప్రోత్సాహకరమే. అలాగే కేంద్ర అధికారులతో చర్చించి వర్జీనియా పొగాకు రైతులకు రూ.110 కోట్ల మేర లబ్ధి చేకూర్చగలిగాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రంతో చర్చించేం దుకు నాలుగు సార్లకు పైగా సీఎం చంద్రబాబు ఢిల్లీకి వచ్చారు. ప్రధాని తోపాటు ముఖ్య నేతలతో చర్చించడం ద్వారా కలిసొచ్చి ప్రాజెక్టు పనులకు రూ.12,500 కోట్లు సహాయం ప్రకటించడమే కాకుండా ఆరు వేల కోట్లు మంజూరయ్యాయి. రైల్వే మంత్రులు, అధికారులతో చర్చించి ఏలూరులో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల హామీని నెరవేర్చాను. నేను గెలిస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చాను. తాజాగా ఏలూరులో జాబ్ మేళా నిర్వహించి 526 ఉద్యోగాలను నిరుద్యోగులకు వచ్చేలా చూశాం. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు అందుకునేలా ముందుకు వెళ్తాం' అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర పామాయిల్ రైతుల అధ్యక్షుడు రాఘవరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పామాయిల్ పండించే రైతులకే కాకుండా నూనె గింజలు పండించే రైతులందరికీ ఎంపీ తీసుకున్న చొరవ ఉపయుక్తమవుతుందని హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రైతులు ఆశించినట్టు సమస్యల పరిష్కారంలో యువ ఎంపీగా ఢిల్లీలో, నియోజకవర్గ పరిధిలోను రాణించారని కితాబు ఇచ్చా రు. పామాయిల్ రైతుకు న్యాయం చేస్తూ ఇంకోవైపు పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయ్యేలా సహకరిస్తూ ఎంపీ తీసుకున్న చొరవ అద్భుతమని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పామాయిల్ రైతులు ఎంపీ పుట్టాతో పాటు మిగిలిన నేతలను గజమాలలతో సత్కరించారు. పామాయిల్ రైతు సంఘాల నాయకులు ఆచంట సూర్యనారాయణ, బొబ్బా వీరరాఘ వరావు, ఉండవల్లి వెంకట్రావు, వంకినేని రామరాజు, క్రాంతికుమార్ రెడ్డి, పెనుమత్స రామరాజు తదితరులు పాల్గొన్నారు.



తోటగూడెం - పునుకొల్లు వద్ద కృష్ణా కాల్వ ఎగువ గట్టుకు పడిన గండి (ఫైల్)

గట్లన్నీ డొల్లే!

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో బలహీనంగా కృష్ణా కాల్వ గట్లు
- గత ఐదేళ్లలో కాల్వ గట్ల అభివృద్ధికి చర్యలు శూన్యం
- ఫలితంగా కోతకు గురైన కాల్వ ఎగువ గట్టు

పెదపాడు, సెప్టెంబరు 16 : వైసీపీ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఐదేళ్లలో కృష్ణా కాల్వ గట్ల అభివృద్ధికి నోచుకోకపోవడంతో కాల్వ వెంబడి గట్లు అత్యంత బలహీనంగా మారాయి. విజయవాడ నుంచి వచ్చే కృష్ణా కాల్వ పెదపాడు మండల పరిధిలో పెరికీడు నుంచి కలపర్రు వరకు ప్రవహిస్తుంది. ఈ పరిధిలో సుమారు 58 వేల ఎకరాలకు సాగు భూములుండగా, వీటిలో 25 వేల ఎకరాలు ఆక్వా రంగంలో ఉన్నాయి. వరి, ఆక్వా రంగా లకు ప్రధాన నీటి వనరుగా కృష్ణా కాల్వ నీటినే వినియోగిస్తారు. గత వైసీపీ ప్రభుత్వం కృష్ణా కాల్వ వెంబడి ఎగువ, దిగువ గట్ల అభివృద్ధి కోసం నిధులు కేటాయించక పోవడం, ఇరిగేష న్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా గట్లు అనేక చోట్ల బలహీనపడ్డాయి. ఇటీవల భారీ వరదలకు కృష్ణా సరిహద్దు ప్రాంతాల ఎగువ నుంచి వచ్చిన వరదనీరు పెద్దఎత్తున పంటపొలాల్లోకి చేరి కృష్ణా కాల్వ గట్టుకు సమాంతరంగా నిలిచింది. వరద ఉధృతి రోజు ల తరబడి కొనసాగడంతో కృష్ణా కాల్వ ఎగువ గట్టు క్రమేపీ కోతకు గురై పంటపొలాల్లోని నీరు కాల్వలోకి ప్రవేశించింది. దీంతో మండల పరిధిలో తోటగూడెం నుంచి పునుకొల్లు గ్రామా ల సరిహద్దుల మధ్య నాలుగు చోట్ల కాల్వ ఎగువ గట్టుకు గండ్లు పడ్డాయి. ఇవే గండ్లు కాల్వ దిగువ గట్టుకు పడితే పలు గ్రామాలు ముంపునకు గురయ్యేవి. ఇరిగేషన్ అధికారులు కాల్వ ప్రవాహ వేగాన్ని తగ్గించేందుకు గోగుల పాడు వద్ద ఎస్కేపులు లేపి నీటి ప్రవాహాన్ని కిందకు వదిలిపెట్టారు. గత ప్రభుత్వంలో నిర్ల క్ష్యానికి గురైన కృష్ణా కాల్వ వెంబడి ఎగువ, దిగువ గట్లను పటిష్ట పరిచి భవిష్యత్తులో వరద విపత్తులు ఎదురైతే ఏర్పడే ముంపు ప్రమాదాలను ముందుగానే అరికట్టాలని కాల్వ వెంబడి గ్రామాల ప్రజలు, రైతులు ప్రజాప్రతి నిధులను, అధికారులను వేడుకుంటున్నారు.

గండ్లు పూడ్చేందుకు చర్యలు

రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్త కుండా యుద్ధప్రాతిపదికన కృష్ణా కాల్వకు పడిన గండ్లు పూడ్చేందుకు చర్యలు తీసుకు న్నట్టు పెదపాడు క్లస్టర్ ఇంఛార్జి గుత్తా అనిల్ తెలిపారు. గండ్లు పడిన ప్రదేశంలో గట్టు పటిష్టపర్చేందుకు బాదులు, వెదురు తడికలు, ఇసుక మూటలతో పనులు చేపట్టామని, మరో రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయన్నారు.



పునుకొల్లు సమీపంలో కృష్ణా కాల్వ గండి పూడ్చుతున్న దృశ్యం



వంటనూనెలు సలసల!

- సామాన్యులు బెంబేలు.. వ్యాపారుల గగ్గోలు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 16 : వంటనూనెలు సలసల కాగుతున్నాయి. ఆ వేడిలో సామాన్యుడు విలవిలాడుతున్నాడు. శనివారం నుంచి వంటనూనె లీటరు ధర రూ.20ల వరకు పెరిగింది. పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనె, సోయానూనె ధరలు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఆ మరుక్షణమే రిటైల్ వినియోగదారులు లీటరుకు రూ.20 పెంచేశారు. దిగుమతి సుంకానికి అదనంగా 5శాతం స్టాండెడ్ సెస్, 10శాతం అగ్రికల్చర్ సెస్ యాడ్ అవుతుంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115 నుంచి 130 వరకు పెరిగింది. చిల్లర దుకాణాల్లో ఇంకో ఐదు రూపాయలు ఎక్కువగానే అమ్ముతున్నారు. పామాయిల్ ధర రూ.95 - 110కు పెరిగింది. వేరుశనగ రూ.145 నుంచి రూ.154 పెరిగింది. దీపారాధన ఆయిల్ రూ.108 నుంచి 121కి పెరి గింది. సన్‌ఫ్లవర్ 15 కేజీల టిన్ రూ.1,750 నుంచి రూ.2వేలకు ఎగబాకింది. పామాయిల్ డబ్బా రూ.1,520 నుంచి 1,720కు పెరిగింది. రైస్‌బ్రాన్ ఆయిల్ రూ.120 - 130కి పెరిగింది. ఒక్కసారిగా ధర పెరగడంతో వినియోగదారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దిగుమతి సుంకం పెంచడంతో దళారులు రంగంలోకి దిగారు. ఉన్న ఆయిల్‌ను గొడౌన్స్‌లో నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి ఇంకా ధరలు పెంచేందుకు పన్నా గాలు పన్నుతున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్వా కంతో అన్ని రకాల ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యావసర సరు కులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరి గాయి. మరోవైపు తాజాగా వరదల కారణంగా కూరగాయల పంటలు దెబ్బతిని కూరగాయల రేట్లు పెరిగాయి. దెబ్బ మీద దెబ్బ అన్నట్లుగా వంటనూనెల పై దిగుమతి సుంకం పెంచడంతో సామాన్యులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు.

పండగల వేళ భయపెడుతున్న ధరలు

పండుగల సమయంలో వంటనూనె ధరలు పెరగడంతో వినియోగదారులు భయపడుతున్నారు. వినాయకచవితి పండు గను మొదలుకుని వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ వరకు చాలా పండుగలున్నాయి. వచ్చే నెలలో దసరా, ఆపై దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో నూనెధరలు మరింత పెరుగతాయని ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. వంటనూనె ధరలు పెరగడం వల్ల ఇతర ఆహార పదార్థాల ధరల వల్ల పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని తగ్గించి ప్రజలపై భారా లు వేయకుండా చూడాలని, బ్లాక్ మార్కెటింగ్ ద్వారా గొడౌన్ల లో దాచిన వంట నూనెలను బయటకు తీసుకొస్తే రేట్లు పెరు గుదలను నివారించవచ్చని వినియోగదారులు కోరుతున్నారు.



వ్యాపారం తగ్గే అవకాశం ..

కేంద్రం దిగుమతి సుంకం పెంచడంతో వంటనూనెల ధరలు పెరిగాయి. ఈ విషయం సామాన్యులకు అర్థంకాదు. ధరలు మేమే పెంచినట్టు ఆలోచించి పక్కషాపునకు వెళ్లి కొనుక్కుం టారు. దీంతో వ్యాపారం తగ్గే అవకాశం ఉంది. కొవిడ్ అనం తరం వ్యాపారం సరిగ్గా నడవక మూడేళ్ల నుంచి నష్టాల్లో ఉన్నాం. అటు వినియోగదారునికి, వ్యాపారులకు ధరల పెరుగుదల నష్టమే.

- వాసు, రిటైల్ వ్యాపారి



ధరల పెరుగుదలతో సతమతం

ఇప్పటికే అన్ని రకాల ధరలు పెరిగాయి. నిత్యావసర సరుకులు కొనలేని పరిస్థితుల్లో ఉన్నాం. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఇప్పటికే బతుకు దెరువు కష్టంగా ఉంది. మరలా మంటనూనె ధరల పెరగడం సామాన్యుడిపై పెనుభారమే. నూనె ధరలు పెరగటం వలన మిగిలిన ఆహార వస్తువుల ధరలన్ని పెరుగుతాయి. మేము బతికేది ఎలా..?. వంటనూనె ధరలు తగ్గించాలి.

- సయ్యద్ అన్వర్, వినియోగదారుడు

అన్న కూటోత్సవం



పాలకొల్లుఅర్బన్, సెప్టెంబరు 16 : స్థానిక శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు 4వ రోజు సోమవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, శ్రీమహలక్ష్మీ హవనం, అన్న కూటోత్సవం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి పవిత్ర వితరణ కార్యక్రమం నిర్వహించారు.



గణనాథుడి ఊరేగింపులో సందడి చేసిన మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, టీబీఆర్ సంస్థ అధినేత భోగేశ్వరరావు

గణనాథుడి ఊరేగింపు

పెంటపాడు, సెప్టెంబరు 16: అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ ప్రాంగణంలో నెలకొల్పిన గణనాథుడిని ఆ సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగించారు. మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. తొలుత ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన లక్కీ డిప్ డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతి రూ. 2.50ల విలువైన మోటార్ సైకిల్, రెండో బహుమతి రూ. 1.25 లక్షల విలువైన ఎలక్ట్రికల్ స్కూటీ, మూడో బహుమతి 10 గ్రాముల బంగారం కాయిన్, నాల్గో బహుమతి ఏసీ తదితర బహుమతులు 10 మందికి అందజేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేళతాళాలు, కేరళ నృత్యాలు బాణాసంచా కాల్పుల నడుమ స్వామి వారిని ఊరేగించి ఏలూరు కాలువలో నిమజ్జనం చేశారు. కూటమి నాయకులు నరిసే సోమేశ్వరరావు, చెరుకూరి జగత్ సోమశేఖర్, పాలిచర్ల ప్రసాద్, సంస్థ కరస్పాండెంట్ పద్మావతి, డైరక్టర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 18 వ తేదీన టీబీఆర్ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు భోగేశ్వరరావు తెలిపారు.



హ్యాకథాన్ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు

వచ్చే నెలలో జాతీయ స్థాయి హ్యాకథాన్ పోటీలు


భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 : ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కోడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 25, 26 తేదీలలో హేకోవర్ ఫ్లో 2024 పేరిట 24గంటల హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు సోమవారం నాడు కళాశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. వెబ్‌సైట్‌ను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోడింగ్ క్లబ్ కన్వీనర్ కె.డేవిడ్‌రాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న హ్యాకథాన్‌లో మూడు ప్రధాన అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వాటిలో వ్యవసాయం, ఆరోగ్య భద్రత, ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ అనే అంశాలపై నిర్వహించే హ్యాకథాన్‌లో 30వేల రూపాయలు విలువైన ప్రైజెస్ కూడా విజేతలను అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక దోపిడీ ఆగలేదు



పాలకొల్లు, సెప్టెంబరు 16: నిర్మాణ రంగం కుదేలైంది. ప్రభుత్వపరంగా పనులు లేనే లేవు. అయినా ఇసుక దోపిడీ మాత్రం ఆగలేదు. జిల్లాలోని పెండ్యాల, పందలపర్రు స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వ ఉంది. ఆన్‌లైన్ విధానం అమలులోకి వచ్చేంత వరకు ఇసుక ఎగుమతులు నిలుపుదల చేయమని జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చారు. అప్పటికే పెండ్యాల స్టాక్ పాయింట్‌లో 135 లారీలకు కూపన్లు ఇచ్చారు. వాటిలో 60 లారీలకు చలానాలు రాసి ఎగుమతులు చేపట్టారు. మిగిలిన 65 లారీలకు అక్రమ పద్ధతుల్లో ఇసుక ఎగుమతి చేశారని ఆరోపణలు వినిపి స్తున్నాయి. పందలపర్రు స్టాక్ పాయింట్లో రికార్డుల పరంగా ఇసుక అయిపోయి నప్పటికీ ఇంకా సుమారు 20వేల టన్నుల ఇసుక ఉన్నట్టు చెబుతున్నారు. ఆన్‌లైన్ బుకింగ్‌కు విధి విధానాలు రూపొందించే వరకు ఇసుక ఎగుమతులు జరగకుండా నిలువరించాలని జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నప్పటికీ ఎగుమతులు జరు గుతుండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి

వడ్డిగూడెంలో అగ్నిప్రమాదం



వీరవాసరం(భీమవరంటౌన్), సెప్టెంబరు 16 : వీరవాసరం మండలం వడ్డిగూడెంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక కుటుంబం కట్టు బట్టలతో మిగిలింది. అదే గ్రామానికి చెందిన నేపాల బ్రహ్మం అనే వ్యక్తి ఇళ్ల ప్రమాదానికి గురైనట్టు అగ్ని మాపకశాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చునని అంచనా వేస్తున్నామని తెలిపారు. ప్రమాదంలో గ్యాస్ సిలిండర్ పేలిపోవటంతో చుట్టప్రక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇంట్లో ఉంచుకున్న కొబ్బరికాయులు ఈ ప్రమాదంలో కాలిపోయాయి. గ్రామస్తులతోపాటు, పాలకొల్లు నుంచి వచ్చిన అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆర్పుతున్నారు. ఈ ప్రమాదం గురించి పూర్తి సమాచారం రావలసి ఉంది.

రేకుల షెడ్డు దగ్ధం

భీమవరం క్రైం, సెప్టెంబరు 16 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రేకుల షెడ్డు దగ్ధమైంది. భీమవరం అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు తెలిపిన వివరాలు ప్రకారం దిరుసుమర్రు గ్రామం కొత్త పేటలో కొప్ప వెంకట్రావుకు రేకుల షెడ్డు ఉన్నది. సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో వారు బయటకు వచ్చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు అక్కడకు వెళ్ళి మంటలను అదుపు చేశారు. లక్ష రూపాయల నగదు కాలిపోవడంతో పాటు లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగినట్టు అగ్నిమాపక అధికారి తెలిపారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవ

వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు



మొగల్తూరు, సెప్టెంబరు 16: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎంపీడీవో వి.బాబ్జిరాజు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టడం, చెత్తా చెదారాలను లేకుండా చేయడం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులను, గ్రామస్థులను భాగస్వాములు చేయడం, పారిశుధ్య కార్మికుల సహకారాన్ని గుర్తించడం ద్వారా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

- 17వ తేదీన మానవహారాలు ఏర్పాటు చేయటం, రాజకీయ నాయకులు, సెలబ్రెటీలు, విఐపీలు, ప్రజలతో కూడిన సామూహిక పరిశుభ్రత డ్రైవ్‌లు నిర్వహిస్తారు.
- 18వ తేదీన స్వచ్ఛతా పరుగు, సైకిల్/మారథాన్ లాంటివి నిర్వహించటం, దోమలు/చీడ పురుగుల నివారణ కోసం స్ప్రే చేయడం, నీటి నిల్వలను తొలగించుట అదే ప్రదేశంలో బ్లీచింగ్ చల్లుట వంటివి చేయాలి. పారిశుధ్య కార్మికులకు ప్రథమ చికిత్స గురించి శిక్షణ ఇవ్వాలి.
- 19వ తేదీన ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, పబ్లిక్ ప్రదేశాలలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయడం, చెత్త దిబ్బలు గుర్తించడం, వాటిని తొలగించటం చేయాలి
- 20వ తేదీ చెట్లు నాటే కార్యక్రమాలు, తల్లి పేరుతో ఒక మొక్క నాటడం చేయాలి.
- 21న మెప్మా, ఎన్‌జీవోల సమన్వయంతో పారిశుధ్యంపై అవగాహనా కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలి. ఉద్యానవనాలు శుభ్రపరుచుట, వాటిని నిర్వహించుట, అభివృద్ధి చేయుట, పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్లు అందించడం,
- 22న మిషన్ లైఫ్ ప్రధాన కార్యక్రమాలు, మురుగునీటి కాలువలను పూడిక తీసి పరిశుభ్ర పరుచుట, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు చేయించడం.
- 23వ తేది సోమవారం వర్షపు నీటి నిర్మాణాలను నిర్వహించుట మరియు తనిఖీ చేయ్యుటకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం, రోడ్లను మరియు పాదచారుల మార్గాలను శుభ్రపరుచుట మరియు మరమ్మత్తులు చేయుట, పారిశుధ్య కార్మికులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు చేయించడం,
- 24న మంచినీటి వనరులు వాటి నిర్మాణాలను శుభ్రపరచుట, వాటి నిర్వహణపై అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయుట, మంచినీటి వనరులు, నిర్మాణాలను శుభ్రపర్చుట, సూపర్ క్లోరినేషన్ చేయుట, నీటి పరీక్షలు, పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వ్యక్తిగత రక్షణపై అవగాహన కల్పించడం.
- 25న కళాజాతలు, వీధి నాటకాల ప్రదర్శనలు, దుకాణాలు మార్కెట్ ప్రదేశాలలో పారిశుధ్యం నిర్వహించుట
- 26న సైబర్ స్వచ్ఛత, డిజిటల్ స్వచ్ఛత. అవసరం లేని /అభద్రత యాప్‌లను తొలగించుట గురించి అవగాహన, ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలను శుభ్రపరచటం, పారిశుధ్య కార్మికుల పిల్లల సంరక్షణా/ఆదరణ కార్యక్రమాలు, విద్యా ఉపకార వేతనాలు అందించుట.
- 27న గ్రామ సభలు, పార్కులు, స్థలాలు, ఫ్లై ఓవర్‌లు, సెల్ఫీ పాయింట్‌లను సుందరీకరించుట.
- 28న ఘన వ్యర్థాల నిర్వహణ, అదిక జన సంచార ప్రదేశాలను శుభ్రపరుచుట, పునర్వినియోగపరిచే వస్తువులను సేకరించి వాటిని రీసైకిల్ కేంద్రాలకు తరలించుట, అవసరమైన ముందస్తు వ్యాక్సినేషన్ చేయించుట.
- 29న గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ పెయింటింగ్‌లు వేయించుట. అభయారణ్య జంతు ప్రదర్శన శాలలు, బీచ్‌లను శుభ్రపర్చడం, పారిశుధ్య కార్మికులకు బీమా పథకాలు నమోదు
- 30న చెత్తను పునర్వినియోగపరిచేలా వర్మీ తయారు చేయుటపై ప్రజలకు అవగాహనా ప్రదర్శనలు, చెత్త నిర్వహణపై అవగాహన, వీధులను శుభ్రపరిచే శిబిరాలు సంఘాల వారీగా నిర్వహించుట, పారిశుధ్య కార్మికులకు బీమా పథకాలు నమోదు చేయుట.
- అక్టోబర్ 1న కమ్యూనిటీ టాయ్‌లెట్స్, పబ్లిక్ టాయ్‌లెట్స్ శుభ్రపరుచుట ఉత్తమ పారిశుధ్య కార్మికులను గుర్తించి వారిని సన్మానించుటం.



పాలకొల్లులో ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

జగన్ పాలనలో అభివృద్ధి వెనక్కి

మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 16: రాష్ట్రంలో ఎక్కడ చూసినా జగన్ సృష్టించిన విధ్వంసాలే కనబడుతున్నాయని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. సోమవారం ఆయన పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనం నిర్మాణ పనులను, బొండాడ వెంకటరాజు గుప్తా ఎన్టీఆర్ కళాక్షేత్రం, రామగుండం పార్కు, శంభుని చెర్వు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనులు వేగవంతంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో నిర్మాణాలన్నీ గాలికొదిలేశారన్నారు. అభివృద్ధి 20ఏళ్ల వెనక్కి వెళ్లిపోయిందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో వందపడకల ఆసుపత్రిని పూర్తి చేసి అన్ని సదుపాయాలతో ప్రారంభించి పాలకొల్లు పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏపీ మెడికల్ కార్పొరేషన్ ఈఈ బీవీ.గిరి, డీఈ యం.శ్రీనివాసరెడ్డి మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, బోనం చినబాబు, కర్నేన గౌరునాయుడు పాల్గొన్నారు.

రేవుల్లో ప్రయాణికుల సందడి

నరసాపురం టౌన్, సెప్టెంబరు 16: నరసాపురం - సఖినేటిపల్లి మధ్య సోమవారం రాకపోకలు పునరుద్ధణయ్యాయి. రెండు రేవుల నుంచి పంట్లు తిరగడంతో పట్టణంలోని మాధవాయిపాలెం రేవులో సందడి కనిపించింది. ఇటు వశిష్ఠ గోదావరిలో వరద సాధారణ స్థితికి చేరింది. రేవుల్లో నీటిమట్టాలు తగ్గడంతో మెట్లపై బురద మట్టి పేరుకుపోయింది. దీంతో స్నానాలకు దిగేందుకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి మెట్లను శుభ్రం చేయించాలని భక్తులు కోరుతున్నారు.

ఏటా ఏదోచోట పేలుడు... దీపావళికి సన్నద్ధమవుతున్న తయారీ దారులు

నిబంధనలు పట్టని హోల్‌సేల్ వ్యాపారులు

బాణసంచా భద్రత ఎంత..?

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 16: బాణసంచా తయారీ, విక్రయాల్లో భద్రత లేక నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. ఒక పక్క తయారీ కేంద్రాలు మరోపక్క హోల్‌సేల్ వ్యాపారుల కక్కుర్తికి ప్రతీఏటా ఏదోచోటా బాణసంచా పేలుళ్లతో అధికారులు హడావుడి తప్ప ముందస్తు తనిఖీలు, భద్రతపై ఆంక్షలు లేకుండా సాగిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాణసంచా తయారీ కేంద్రాలు జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో ఎక్కువ. గతేడాది తాడేపల్లిగూడెం మండలం కడియద్ద వద్ద బాణ సంచా తయారీ కేంద్రంలో విస్ఫోటనంలో ముగ్గురు కూలీలు బలైపోవడంతో అధికారులు అప్రమత్తమై జిల్లాలో తయారీ కేంద్రాలకు అనుమతి ఇవ్వలేదు. అయినా తయారీ యథేచ్ఛగా సాగాయి. వీటికి తోడు బాణసంచా హోల్‌సేల్ షాపుల్లో భద్రత అంతంత మాత్రమే. షాపులకు ఇచ్చిన అనుమతికి మించి బాణసంచా నిల్వలు ఉంచడంతోపాటు, ఒక లైసెన్స్‌తో మరికొన్ని షాపులు నిర్వహిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ బాణసంచా తయారీ కేంద్రాల వద్ద భద్రత పట్టించుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

విజయవాడ పేలుడులోనూ..

రెండేళ్ల క్రితం విజయవాడ బాణసంచా విక్రయకేంద్రాల వద్ద పేలుడు సంభవించి పలువురు మృతి చెందిన ఘటన వెనుక తాడేపల్లిగూడెం హోల్‌సేల్ దుకాణంలో విక్రయించిన పేలుడు పదార్థాల వల్లే సంభవించిందని పోలీసులు నిర్ధారించి ఇక్కడ హోల్‌సేల్ దుకాణ నిర్వాహకులపై కేసులు నమోదుచేశారు. అంటే తయారీ కేంద్రాలు, హోల్‌సేల్ దుకాణాలపై నియంత్రణ చేస్తే ప్రజల ప్రాణాలకు రక్షణ దొరుకుతుంది.

ఏటా ఏదో ప్రమాదం...

దీపావళి పండుగ కోసం బాణసంచా తయారీ కేంద్రాలు, హోల్‌సేల్ దుకాణాలలో నిబంధనలకు పాతర వేస్తుండటంతో ప్రమాదాలు తరచూ జరుగుతూ అధికారుల తనిఖీల్లో డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.



2010లో జిల్లాలోనే అత్యంత భయంకరమైన ప్రమాదం ఉంగుటూరు మండలం వెల్లమిల్లిలో భారీ విస్ఫోటనం జరిగి 8 మంది మృత్యువాత పడగా ప్రతి ఏటా ఏదోచోట ప్రమాదాలకు అమాయకులు బలవుతూనే ఉన్నారు. అనుమతులకు మించి బాణసంచా నిల్వలు ఉంటున్నా దుకాణాల్లో, తయారీ కేంద్రాల్లో నిబంధనలు గాలికి వదిలేస్తున్నారు.

క్రైం కార్నర్

మిషన్‌లో పడి యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16: అదృశ్యమైన వ్యక్తి తాను పనిచేస్తున్న మిషన్‌లోనే పడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు గుర్తించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. బీహార్‌నకు చెందిన కొంతమంది ఏలూరు - ఆశ్రం ఆసుపత్రి సమీపంలోని వేసగాని బ్రిడ్జి పక్కనే ఉన్న విజయ దుర్గ ట్రేడర్స్‌లో పనిచేస్తున్నారు. ప్లాస్టిక్ బాటిల్స్‌ను మిషన్ ద్వారా క్రషింగ్ చేసి బేళ్ళుగా చేస్తారు. బీహార్ నుంచి వచ్చిన వారిలో పుల్సర్‌శర్మ (35) ఆ పని చేస్తున్నాడు. ఈనెల 15వ తేదీ రాత్రి అతను పనిచేస్తున్న మిషన్‌లోనే పడి బటన్ నొక్కుకోవడంతో ప్లాస్టిక్ బాటిల్స్‌తో పాటు అతను కూడా నుజ్జు నుజ్జు అయ్యాడు. సోమవారం ఉదయం పోలీసులు నుజ్జయిన మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఉన్న సీసీ ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలించారు. తాను ఒక్కడే మిషన్ ఆన్‌చేసి లోపలకి వెళ్ళి కూర్చోవడంతో మిషన్ అతనిని నొక్కేసింది. దీంతో అతను మరణించాడు. ఈ దృశ్యాన్ని సీసీ ఫుటేజ్‌లో రికార్డు అయ్యాయి. ఈ సంఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బీహార్‌లోని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి

కుమార్తెకు గాయాలు

ఉంగుటూరు,సెప్టెంబరు 16: జాతీయ రహదారిపై బాదంపూడి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తాడేపల్లిగూడెం మహాలక్ష్మి నగర్‌కు చెందిన బాదరాల సువార్త వాణి(47) ఆదివారం రాత్రి తన కుమార్తె అమూల్యతో కలిసి బాదంపూడిలో ప్రార్థన అనంతరం తన ఇల్లు తాడేపల్లిగూడేనికి స్కూటీపై వెళుతుండగా సిరామిక్ టైల్స్ బజార్(గోదాము) సమీపంలో జాతీయ రహదారి పై అదుపు తప్పింది. కుమార్తెకు స్వల్ప గాయాలవ్వగా, తల్లి సువార్తవాణికి తీవ్ర గాయం అవ్వగా ఆమెను తొలుత తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందింది. ఈ సంఘటనపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చేబ్రోలు ఎస్ఐ సూర్య భగవాన్ తెలిపారు. మృతురాలి భర్త (పాస్టర్) బాదరాల మల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఒకరి మృతి



ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

కొయ్యలగూడెం, సెప్టెంబరు 16: అదుపు తప్పి కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై చంద్ర శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం కేతవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు (62) కొడుకుకోడలు, మనవడితో కలిసి మారుతికారులో నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామంలో ఒక శుభకార్యానికి వెళ్ళారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కొయ్యలగూడెం మండలం ఆరిపాటి దిబ్బల వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. డ్రైవింగ్ చేస్తున్న తండ్రి వెంకటేశ్వరరావు తీవ్రగాయాలతో మృతి చెందాడు. కొడుకు నాగవెంకట రామారావు, కోడలు సౌజన్య, మనవడుకి గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్ధరాత్రి వైద్యురాలిపై దురుసు ప్రవర్తన

పోలీసులకు ఫిర్యాదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16 : ఘర్షణ పడ్డ వ్యక్తులు ఆసుపత్రికి రాగా వారితో పాటు వచ్చిన ఒక వ్యక్తి డ్యూటీ వైద్యురాలిపై దురుసుగా ప్రవర్తించి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆ వైద్యురాలు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి అత్యవసర విభాగంలో ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి ఒక వైద్యురాలు విధులను నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఆ వైద్యురాలు ఏడవ నెల గర్భిణీ. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో దెందులూరు మండలం ఉండ్రాజవరం గ్రామం నుంచి కొంత మంది ఘర్షణ పడ్డ వ్యక్తులు ఆసుపత్రికి వచ్చారు. తమకు ఎమ్మెల్సీ చేయాలని వారు కోరారు. అయితే ముందు వైద్యం చేయించుకోమని సూచించారు. కాని ఆ వ్యక్తులతో పాటు వచ్చిన పోతునూరుకు చెందిన బొడ్డేటి మోహన్ అనే వ్యక్తి ఆ వైద్యురాలిని ఏక వచనంతో మాట్లాడుతూ ముందు ఎమ్మెల్సీ చేయి అంటూ బెదిరింపులకు దిగాడు. అతనిని బయటకు వెళ్ళమని వైద్యురాలు చెప్పడంతో కొట్టడానికి మీదకు వెళ్ళాడని అక్కడ ఉన్న ప్రత్యక్ష సాక్ష్యులు చెప్తున్నారు. తెల్లవారేటప్పటికి ఉద్యోగాన్ని తీయిస్తానని బెదిరింపులకు దిగడంతో ఆ వైద్యురాలు ఈ సంఘనటపై రాత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఇప్పటి వరకూ ఎలాంటి చర్య తీసుకోలేదని ఆ వైద్యురాలు వాపోతున్నారు. ఇది ఇలా ఉండగా బెదిరింపులకు దిగిన వ్యక్తి మరి కొంత మంది ఆసుపత్రి వద్దకు వచ్చి హడావుడి చేసి భయభ్రాంతులకు గురి చేసి వెళ్ళాడని చెబుతున్నారు. ఫిర్యాదుపై తక్షణం పోలీసులు స్పందిస్తే అతను ఆసుపత్రికి వచ్చేవాడు కాదని ఆసుపత్రి వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఆ వ్యక్తి తాము అధికారపార్టీకి చెందిన నాయకుడినని చెప్పుకుని బెదిరింపులకు దిగాడని చెబుతున్నారు. ఈ సంఘటనపై మంగళవారం ఆసుపత్రి ఉద్యోగులు, వైద్యులు ధర్నా నిర్వహించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16 : వేగంగా వెళ్తున్న రైలు బోగీ గుమ్మంలో నిలబడ్డ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అస్సాం రాష్ట్రానికి చెందిన జైదుల్ ఇస్లాం (29) మైసూర్ నుంచి హౌరాకు రైలులో ప్రయాణిస్తున్నాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని కొయ్యూరు రైల్వే గేటు వద్ద ప్రమాదవ శాత్తు జారిపడి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ పి సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

కోడి పందేలపై దాడి

కాళ్ళ, సెప్టెంబరు 16 : ఏలూరుపాడు సంతపేట ఏరియాలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ.1950 నగదు, కోడిపుంజు, కోడికత్తి స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఏడుగురిపై కేసు నమోదు

భీమడోలు, సెప్టెంబర్ 16 : చేపల చెరువులకు కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి దీనికి సంబంధించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. విజయవాడ నుంచి అంబర్‌పేట చేపల చెరువులకు తరలిస్తున్న కోడి వ్యర్థాలను పోలీసులు అడ్డుకున్నారు. చేపల చెరువు రైతు వినాయక్, వాహనం యజమాని సాంబశివరావు, కోడి వ్యర్థాల అమ్మకాలకు సంబంధించిన మధ్య వర్తి భలే సుబ్బరాజుతో పాటు వాహనాన డ్రైవర్, మరో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి

టి.నరసాపురం, సెప్టెంబరు 16: మహిళపై దాడిచేసి కొట్టి గాయపరిచిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎం.రాజు తెలిపారు. మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన సందిపాము లక్ష్మి ఈనెల 13 రాత్రి తన కోడలిని తిడుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన తడికమళ్ళ వాసు మరొకరు తమని తిడుతుందని భావించారు. దీనితో లక్ష్మిపై దాడిచేసి కొట్టి గాయపరిచారని ఆమెను చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్టు

పెంటపాడు, సెప్టెంబరు 16: చోరీకి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను పెంటపాడు ఎస్ఐ స్వామి సోమవారం అరెస్టు చేశారు. చిలకంపాడు లాకుల వద్ద ఈ నెల 14వ తేదీ రాత్రి కిందుల రాంబాబుకు చెందిన రేకుల షెడ్డులో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి సుమారు 80 వేల విలువ చేసే సెకండ్ హ్యాండ్ మోటార్ సైకిల్, 8 కోళ్ళు దొంగిలించారు. సోమవారం పెంటపాడు కాలేజీసెంటర్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు తారసపడ్డారు. స్టేషన్‌కు తీసుకువెళ్ళి విచారించగా దొంగతనం చేసింది వీరే నని రుజువైంది. దీంతో తాడేపల్లిగూడెంకు చెందిన యంగి ఏసురత్నం (అలియాస్ కోటయ్య), యర్రసాని వీర్రాజు, ఉయ్యాల నాగరాజులను ఎస్ఐ అరెస్టు చేశారు. గతంలో కూడా వీరిపై తాడేపల్లిగూడెం టౌన్, పాలకొల్లు టౌన్, తాళ్ళపూడి పోలీస్‌స్టేషన్‌లలో మోటార్ సైకిళ్ళ చోరీ, గంజాయి కేసులు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరు దొంగిలించిన మోటార్ సైకిల్, కోళ్ళు రికవరి చేసినట్లు తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 16: జూలై 22వ తేదీ రాత్రి పట్టణంలోని మార్కండేయపురంలో తాళం వేసిఉన్న ఇంట్లో దొంగతనం చేసిన కేసులో కామవరపుకోట మండలం రావికంపాడుకు చెందిన యడ్లపల్లి హేమంత్ ను సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ వి.కృష్ణబాబు తెలిపారు. అతని నుంచి చోరీ సొమ్ము రికవరీ చేసి రిమాండ్ నిమిత్తం ఏలూరు సబ్‌జైల్ కు పంపించినట్లు తెలిపారు. నేరస్థుడిని పట్టుకోవడానికి సహకరించిన ఎస్సై ఎస్‌కె.జబీర్, ఏఎస్సైలు సంపత్,రాజేంద్ర ఇతర పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

మరో ఇద్దరికి స్వల్ప గాయాలు



చికిత్స పొందుతున్న క్షత గాత్రుడు రమేశ్... ప్రమాదానికి కారణమైన కారు

భీమడోలు, సెప్టెంబర్ 16 : మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన గుండుగొలను జాతీయ రహదారిపై జరిగింది. ఏలూరుకు చెందిన ఎస్.స్వాతి, రమేష్, వీరి కొడుకు చేతనేశ్వర్ మోటారు సైకిల్‌పై ఏలూరు నుంచి గణపవరం మండలంలోని బావాయిపాలెంలో జరుగుతున్న ఒక ఫంక్షన్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో గుండుగొలను సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్వాతికి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. భర్త రమేష్, కొడుకు చేతనేశ్వర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. స్వాతిని తొలుత ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. దెందులూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


విద్యుత్ అక్రమంగా వాడుతున్న బోరు, (ఇన్‌సెట్) ట్రాన్స్‌ఫార్మర్, మీటరు

బిల్లు కట్టకుండా విద్యుత్ వాడకం..

చర్యలు తీసుకోవాలి : టీడీపీ నాయకులు, రైతులు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 16: మండలంలోని పేరంపేట పంచాయతీ పరిధిలోని వెంకట రామానుజపురంలో ప్రభుత్వానికి బిల్లు చెల్లించకుండా సుమారు రెండేళ్లుగా విద్యుత్ వినియోగిస్తున్నారు. సంబంధిత రైతుపై విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పేరంపేట టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోలి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు, టీడీపీ నాయకులు సోమవారం విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న పొలం వద్దకు విలేకరులను తీసుకెళ్లి చూపించారు. మరో రైతు పొలంలో బోరు వేయకుండానే ఏడాది క్రితమే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, మీటరు బిగించడంపైనా టీడీపీ నాయకులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని అనుమతులు ఉన్నా ఎంతో మంది రైతులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి ఇబ్బందులకు గురి చేసే అధికారులు ఇక్కడ బోరు లేకుండానే విద్యుత్ లైను ఎలా వేశారని ప్రశ్నించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతు తన పొలంలో బోరు వేసుకోవాలంటే ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, అనుమతి ఇచ్చిన తర్వాత జియాలజిస్ట్ వచ్చి పొలంలో నీరు పడుతుందా.. లేదా ఎక్కడ పడుతుందనే విషయాన్ని సర్వే చేసి సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత మాత్రమే విద్యుత్ లైన్ వేయాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బోరు, మోటారు లేకుండానే ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, రైతు పేరుతో విద్యుత్ మీటర్, మూడు స్తంభాలు వేసి విద్యుత్ లైన్ వేశారని తెలిపారు. అధికారులు స్పందించి అనధికార విద్యుత్ లైన్, విద్యుత్ అక్రమ వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు ఉప సర్పంచ్ గోలి సత్తిరెడ్డి, రైతు దోరేపల్లి వెంకటరత్నం, టీడీపీ నాయకులు జి.రామారావు, కంకిపాటి భార్గవ్, కలపాలకోటి, రవికుమార్ తదితరులు ఉన్నారు.

ఏలూరులో పోలీస్ ఫ్లాగ్ మార్చ్


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16: ఎదుటి మతం పట్ల ఎటు వంటి ద్వేషభావం లేకుండా ఎటు వంటి వ్యాఖ్యలు చేయకుండా పండుగను నిర్వహించుకోవాలని డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. నగరంలో సోమవారం మిలాద్ ఉన్ నబి పర్వదినం, వినాయక నిమజ్జన కార్యక్రమాలను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వన్‌టౌన్ పరిధిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐలు సత్యనారాయణ, వైవి రమణ, కోటేశ్వరరావు, గోపాలకృష్ణ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, ఎస్‌ఐలు, సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో ఎటువంటి అంతరాయం కలుగకుండా వాహనాలను దారి మళ్లించామని, ఊరేగింపులో బాణసంచా కాల్చరాదని, అశ్లీల నృత్యాలు ప్రదర్శించరాదని, ఎవరైనా పోలీసు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీస్ శాఖ పెట్రోల్ బంక్‌కు ఎస్పీ శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 16: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏలూరు నగర ప్రజలకు సరైన కొలతలు, నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందించడానికి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. అమీనాపేట పోలీస్ కల్యాణమండపం పక్కన స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి సోమవారం ఆయన భూమి పూజ నిర్వహించారు. ఇంజనీరింగ్ అధికారులను పెట్రోల్ బంక్ నిర్మాణ డిజైన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం


పవిత్రోత్సవాల్లో ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 16: నగరంలో ఆర్ఆర్.పేట వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నూతన పాలక మండలి నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాల్లో సోమవారం ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. దేవినేని వెంకటేశ్వరకుమార్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ. 8లక్షలతో నిర్మించిన ఉత్తర సింహ ద్వారాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రారంభించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ పవిత్రోత్సవాల్లో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. అర్చకులు శ్రీనివాస రామానుజాచార్యులు, కె.సత్యనారాయణాచార్యులు, వేదపండితులు వైవీ రవిప్రకాశ్ శర్మ, ఆశీర్వచనాలు అందజేశారు. పి.రాజేంద్రప్రసాద్, రమాదేవి, ఈతకోట శ్రీనివాసరావు, జంపా సూర్యనారాయణ, టి.శ్రీనివాస్, కే.విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం : చింతమనేని


కార్యకర్తల సమస్యలు వింటున్న చింతమనేని

పెదవేగి, సెప్టెంబరు 16: వందరోజుల కూటమి పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని ఆయన చెప్పారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై సమీక్షించారు. సంక్షేమ పథకాలను అందిస్తున్న కూటమి ప్రభుత్వం త్వరలోనే అర్హులందరికీ సామాజిక పింఛన్లు మంజూరుకు చర్యలు చేపట్టిందన్నారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు విరాళాలు


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితుల సహాయార్థం దాతలు సోమవారం విరాళాలు అందజేశారు. నిడమర్రు, గణపవరం మండలాల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రూ.50 వేలను ఎమ్మెల్యే ధర్మరాజుకు అందించారు. చేబ్రోలుకు చెందిన శీలం పల్లేశ్వరరావు రూ.30వేలు, ఉప్పాకపాడు ఫౌండేషన్ పాఠశాలల విద్యార్థులు రూ.15 వేలు, నిడమర్రు మండలం గుణపర్రు సర్పంచ్ కూనపరాజు వెంకట సత్యనారాయణరాజు రూ.25 వేలు, ఉప్పాకపాడు గ్రామానికి చెందిన ముత్యాల శ్రీనివాసరావు రూ.10వేలు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు అందించారు.

మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయనతో పాటు కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బడే కోమలి, లీగల్ సెల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు హోలీ ట్రినిటీ గోల్డెన్ చర్చ్ సాయం



నిత్యావసరాలతో వెళుతున్న వాహనం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 16: విజయవాడ వరద బాధితులకు హోలీ‌ట్రినిటీ గోల్డెన్‌చర్చ్ సాయాన్ని అందజేసింది. సుమారు రూ.లక్ష విలువచేసే నిత్యావసరాలు, చీరలు, దుప్పట్లు, టవల్స్ టాయిలెట్ ఐటమ్స్, వాటర్ బాటిల్స్ తదితర సామగ్రితో వాహనంలో వలంటీర్లు సోమవారం పయనమయ్యారు. రెవరెండ్ జి.ఆనంద్‌కుమార్, వి.నిరీక్షణకుమార్, సీహెచ్ విల్సన్, ఎన్.డి కృపానందం, జె.ఐజాక్, వై.కృపామణి, వి.నళినిరాజ్, విజయవర్ధిని, యూత్ సభ్యులు, కౌన్సిల్ సభ్యుడు హెరాల్డ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల రవాణా

రహదారి పక్కన దుర్గంధం
చేపల మేతకు వినియోగం
పట్టించుకోని అధికారులు

పోలవరం, సెప్టెంబరు 16: మండల కేంద్రంలో కోడి మాంసం దుకాణాల నుంచి వ్యర్థాలను ప్రత్యేక వ్యాన్‌పై ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. విక్రయాలు ఎక్కువగా ఉన్న సందర్భాలు, మాంసం ఆర్డర్లు ఉన్న సందర్భాలలో వ్యానుపై వ్యర్థాలను తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న చేపల చెరువులకు తరలించి చేపలకు ఆహారంగా వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు మార్గంలో పలుమార్లు చికెన్ వ్యర్థాలు పడవేస్తున్నారు. రాకపోకలు సాగించే అధికారులు, కార్మికులు, ప్రయాణికులు, పర్యాటకులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. కోడి మాంసం విక్రయాలు మార్కెట్‌లో వారికి కేటాయించిన షెడ్డులో సాగించవలసి ఉంది. వ్యాపారులు రోడ్డుకిరువైపులా దుకాణాలు ఏర్పాటు చేశారు. పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చినా వ్యాపారులు ఖాతరు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు వీధి కుక్కలు దుకాణాల వద్ద గుంపులు సంచరిస్తూ స్థానికులు, వాహనదారుల వెంటపడి గాయపరుస్తున్నాయి. అధికారుల స్పందించి కోడి వ్యర్థాల అక్రమ తరలింపును అరికట్టి గ్రామానికి దూరంగా గుంతలు తవ్వి పాతిపెట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దుకాణాలను మార్కెట్ షెడ్‌లకు తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పోలవరంలో కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యాన్


పోలవరం, ఏలూరు, పెదవేగి, టి.నరసాపురం, జీలుగుమిల్లిలో వినాయక విగ్రహాలతో వైభవంగా సాగిన ఊరేగింపు, గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు

గణేశ్ నిమజ్జనం

భారీ ఊరేగింపుతో గ్రామాల్లో సందడి


ఏలూరులో నిమజ్జనానికి తరలిన గణేశ్ విగ్రహం


ఏలూరు నగరంలో గణేశ్ నిమజ్జన ఊరేగింపు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 16: గణేశ్ ఉత్సవాల్లో భాగంగా నవ రాత్రులు ముగియడంతో సోమవారం ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తరలించి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊరేగింపులు, మేళతాళాలు, బాజాభజంత్రీలు, తీన్‌మార్ వాయిద్యాలు, డీజె సౌండ్, కోలాట ప్రదర్శనలు, భక్తుల నృత్యాలతో వీధులన్నీ హోరెత్తాయి. ఏలూరులో కుండీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన 20 అడుగుల భారీ గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనానికి ఊరేగింపుగా తరలించారు. రామకోటి ప్రాంగణం, పవరుపేట, నరసింహ రావుపేట, పత్తేబాద, అశోక్‌నగర్, రామచంద్రరావుపేట, తదితర ప్రాంతాల నుంచి ఉత్సవ గణనాథులు ఊరేగింపుతో సందడి నెలకొంది. హేలాపురి అంతా భక్తులతో ఊరేగింపులతో వాయిద్యాలతో వీధులన్నీ కిటకిటలాడాయి.

● పోలవరం: మండలంలో గణపతి విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. నూతనగూడెంలో భారీ గణపతి విగ్రహాన్ని ప్రధాన రహదారుల్లో తీన్‌మార్ వాయిద్యాలు డిజె సౌండ్ బాక్సులతో ఊరేగించారు. కొత్తపేటలో వినాయకుని ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.

● జీలుగుమిల్లి: వినాయక ఆలయం వద్ద గణేశ్ విగ్రహాలను సోమవారం ఊరేగింపు నిర్వహించారు. కోలాట నృత్యాలతో పుర వీధుల్లో వినాయకుడిని ఊరేగించారు. మహిళల సంప్రదాయ కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. అభయాంజనేయస్వామి, ముత్యాలమ్మ, జగదాంబ ఆలయాల వద్ద మహిళలు కోలాటం వేశారు.

● ఉంగుటూరు: మండలంలో చిన్నారుల వినాయక చవితి ఉత్సవాల ఊరేగింపు సోవవారం జరిగింది. చిన్నారులు ఆటోలో స్వామిని ఊరేగించగా మహిళలు తాంబూలాలు, అన్న సమారాధనకు సామగ్రి అందించారు. పలు గ్రామాలలో అన్న సమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ సమారాధనలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● లింగపాలెం: మండలంలో వినాయక నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. లింగపాలెం, ములగలంపాడు, రంగాపురం, మఠంగూడెం గ్రామాల్లోని వినాయకుని ప్రతిమలను నిమజ్జనం చేశారు. వాయిద్యాలు, కోలాహలం నడుమ నిమజ్జనం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● చింతలపూడి: పట్టణంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన గణేశ్ విగ్రహాలను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. కొప్పులవారివీధి, ఘంటావారివీధి, పాత బస్టాండు ఆంజనేయస్వామి ఆలయం వద్ద సుబ్బరాజుస్కూల్ సెంటర్, వెలమపేట, వడ్డెరగూడెం, వెంకటరామాబాగ్, ముతరాసుల కాలనీలలో ఏర్పాటుచేసిన విగ్రహాలను తీన్‌మార్ డప్పులు, కోలాటం, డ్యాన్సులు, డిజె సౌండ్స్‌తో ఊరేగిస్తూ తమ్మిలేరు రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు.

● ద్వారకాతిరుమల: గణనాయకుని నిమజ్జన వేడుకలు తిమ్మాపురంలో సోమవారం అట్టహాసంగా జరిగాయి. గణపయ్యను ప్రత్యేక వాహనంలో మేళతాళాలు, డోలుసన్నాయి వాయిద్యాలు, బాణసంచా మోతలు, యువత ఆనందోత్సాహాల నడుమ వైభవంగా గ్రామంలో ఊరేగించారు. అతరువాత సమీపంలో ఉన్న చెరువులో నిమజ్జనం నిర్వహించారు.

● టి.నరసాపురం: మండలంలోని బండివారిగూడెంలో గణేశ్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గణనాథుని పుర వీధుల్లో తీన్‌మార్ డప్పులతో ఊరేగించి స్థానిక ఎర్రకాలువలో నిమజ్జనం చేశారు.

● వేలేరుపాడు: మండలంలో విశేష పూజలందుకున్న గణనాథులు సోమవారం శోభాయాత్రగా బయల్దేరి గోదావరిలో నిమజ్జన కార్యక్రమానికి తరలివెళ్లారు. రుద్రమ్మకోట వద్ద గోదావరిలో గణేశుని విగ్రహాలను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య విగ్రహాలను నిమజ్జనం చేశారు.

● పెదవేగి: బ్రహ్మంగారి ఆలయం దగ్గర భారీ వినాయకుని నిమజ్జనం వేడుకలు వైభవంగా నిర్వహించారు. తీన్‌మార్ వాయిద్యాలు, ఆకట్టుకునే నృత్యాల నడుమ గణనాథుడు ఊరంతా తిరిగాడు. పోలవరం కాలువలో నిమజ్జనం చేశారు. గ్రామాల్లో గణపతి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మ రక్షణ

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 16: విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వలన శరీరక ధ్రుడత్వంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పొందిన 25 మంది విద్యార్థులకు బడేటి క్యాంపు కార్యాలయంలో సోమవారం బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజింగ్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కె.రాజశిఖామణి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ కేపీఎస్.కిశోర్, మాస్టర్ జీవీ.రాఘవ, మహిళా కోచ్ సరస్వతి రాఘవ, గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్ ప్రభు, టీడీపీ నాయకులు మారం హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు ఎన్.సుబ్రహ్మణ్యం, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీ నిర్వహణపై కేసు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 16: అనుమతి లేకుండా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించిన వారిపై త్రీ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఆర్ఆర్ కాలేజీలో ఈనెల 15న రాత్రి 11.30 గంటలకు ఆంధ్రాబాడీ బిల్డింగ్ చాంపియన్ పోటీలను నిర్వహించారు. బాడీ బిల్డర్ అసోసియేషన్ మధ్య గొడవ పడి ఘర్షణలకు దిగారు. సోషల్ మీడియా వైరల్ కావడంతో సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పరిశీలించారు. నిర్వాహకులు తాతినేని రఘుపవన్, షేక్ రెహ్మాన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు సబ్ డివిజన్‌లో పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్నప్పటికీ అనుమతి తీసుకోకుండా పోటీలు నిర్వహించారని, ఈ సంఘటనపై త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారిద్దరిని అరెస్టు చేయడానికి చర్యలు చేపట్టారు.

అశోక్‌బాబు కుటుంబానికి కారుమూరి పరామర్శ

కామవరపుకోట, సెప్టెంబరు 16: కె.ఎస్.రామవరం గ్రామానికి చెందిన మేడవరపు అశోక్‌బాబు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్ సోమవారం పరామర్శించారు. అశోక్ శ్రీనివాస్ సతీమణి, ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మిని పరామర్శించి సానుభూతి తెలిపారు. అశోక్ శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● బుట్టాయగూడెం: మేడవరపు అశోక్‌బాబు మరణం పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం అశోక్‌బాబు స్వగ్రామం కళ్ళచెరువులో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైసీపీ నాయకులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెరగనున్న పామాయిల్ ధరలు

కొయ్యలగూడెం, సెప్టెంబరు 16: క్రూడాయిల్‌ను పెంచడం వలన పామాయిల్ ధరలు పెరగనున్నాయని ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామారావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో రైతులు ఎక్కువ రైతులు పామాయిల్ సాగుపై ఆధారపడి ఉన్నారని, కొంత కాలంగా పామాయిల్ ధర పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. క్రూడ్ ఆయిల్‌పై ట్యాక్స్‌ను పెంచేవిధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, రైతులకు లబ్ధి చేకూరనుందన్నారు. పామాయిల్ ధర టన్నుకు రూ.1000 నుంచి 1500వరకు పెరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి పామాయిల్ రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● కామవరపుకోట: పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కృషి చేసిన ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, సర్పంచ్‌లు పసుమర్తి పార్థసారధిబాబు, గూడపాటి కేశవరావు, గోరింక దాసు, వేముల నాగేశ్వరరావు, కంఠమనేని అంజిమూర్తి, ఘంటా సత్యంబాబు ఎంపీని సత్కరించారు.

నిమ్మ రైతులను ఆదుకోవాలి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 16: మార్కెట్‌లో ధర ఉన్నా దిగబడిలేక నిమ్మరైతు నష్టాల్లో ఉన్నాడని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. పంగిడిగూడెంలో రైతు సంఘనేతలు పర్యటించి నిమ్మ తోటలను పరిశీలించారు. నిమ్మ రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత ఆయన మాట్లాడుతూ ఎర్రనల్లి, తెల్లదోమ వంటి తెగుళ్ల వల్ల నిమ్మ దిగుబడి బాగా తగ్గిందని, ధర పెంచినట్లు ప్రచారం చేయడం వల్ల రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

పర్యావరణంపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

ఏలూరు రూరల్, సెప్టెంబరు 16: పర్యావరణాన్ని పరిరక్షణ అందరి బాధ్యత అని సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ హెచ్‌వోడి కె.శ్రీధర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పర్యవేక్షణపై స్ట్రీట్‌ప్లే నిర్వహించారు. మొక్కలు నాటుదాం, వృక్షాలు పెంచుదాం, ప్లాస్టిక్ కవర్లను విడనాడుదాం, క్లాత్, జ్యూట్ బ్యాగులను వాడుదాం అంటూ నినాదాలు చేశారు. శ్రీధర్ మాట్లాడుతూ మానవులు చేసిన తప్పిదాల వల్లే విపత్తులు సంభవిస్తున్నాయని, ఓజోన్‌పొర దెబ్బతినటం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. అనంతరం క్లాత్‌బ్యాగులను ప్రజలకు పంపిణీ చేశారు. కళాశాల స్టాఫ్ కోఆర్డినేటర్ ఎస్.సతీష్, కవిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలకడగా కూరగాయల ధరలు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 16 : కూరగాయల ధరల అధికారుల పర్యవేక్షణతో నిలకడగా ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో మాత్రం రైతు బజారు కంటే అధిక ధరలకు అమ్ముతున్నారని, వాటిని కూడా అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రైతుబజారులో సోమవారం కిలో టమాట రూ.40, వంకాయ రూ.70, బెండ రూ.40, మిర్చి రూ.28, కాకర రూ.48, క్యాబేజి రూ.28, క్యారెట్ రూ.40, దొండ రూ.38, బంగాళాదుంప రూ.40, ఉల్లి రూ.56, గోరుచిక్కుడు రూ.54, దోస రూ.30, చేమదుంప రూ.48, బీట్‌రూట్ రూ.38, కీరదోస రూ.44, బీన్స్ రూ.80, అల్లం రూ.160, క్యాప్సికం రూ.80, ఆకాకర రూ.160 చొప్పున విక్రయించారు. పాలకూర, చుక్కకూర, మెంతుకూర రూ.10 చొప్పున, అరటికాయ ఒక్కింటికి 7 నుంచి 10, సొరకాయ రూ.20, ఆనప రూ. 30, పొట్లకాయ రూ. 25 చొప్పున విక్రయించారు.

నిల్వ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు


దుకాణం వద్ద కమిషనర్ తనిఖీ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 16: నిలువ ఉంచిన మాంసాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుంటామని మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్ర కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని మటన్ దుకాణంలో సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఫ్రిజ్‌లో నిలువ ఉంచిన 25 కిలోల మాంసాన్ని గుర్తించి సీజ్ చేశారు. సీజ్ చేసిన మాంసాన్ని పట్టణంలో దూరంగా భూమిలో పూడ్చిపెట్టినట్లు ఆయన తెలిపారు.

దేశం గుర్తించిన గొప్ప నాయకుడు ఏచూరి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 16: దేశం గుర్తించిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి అని, విద్యార్థి దశ నుంచే అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి సీపీఎం ప్రధాన కార్యదర్శి అయ్యారని మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అన్నారు. రెడ్డిగణపవరంలో కట్టం వెంకటేశ్వరావు అధ్యక్షతన సోమవారం జరిగిన సీతారాం ఏచూరి సంతాప సభలో నాయకులు మాట్లాడారు. యూపీఏ-1 ప్రభుత్వ కాలంలో పేదలకు అవసరమైన ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం చేయడంలో కీలక భూమిక పోషించారని, గొప్ప నాయకుడిని సీపీఎం కోల్పోయిందన్నారు. ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పి.మంగరాజు, పవన్, పూనెం దుర్గారావు, కొమరం శ్రీరాములు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


కర్బలా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 16: నగరంలో సోమవారం మిలాద్‌ఉన్‌నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రూరల్ గ్రామాల్లో ఘనంగా వేడుకలు జరిగాయి. ఉదయం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం స్థానిక కర్బలా మైదానంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ కాశీమ్ రాజా ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అల్లా సర్వమానవాళి శ్రేయస్సు శాంతిని నెలకొల్పటం కోసం ఆఖరి ప్రవక్త మహ్మద్‌ను ఎన్నుకున్నట్లు అంతిమమైన గ్రంథం పవిత్ర ఖురాన్‌లో ఉందన్నారు. మహ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో ప్రతి ముస్లిం నడవాలని సూచించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఎస్‌కె షాబీర్‌హుస్సేన్, ఎమ్డీ గాలబ్‌ఆలీ, ఎండీ ఇక్బర్, ఎండీ ఉస్మాన్‌దవులా, అస్లామ్‌రాజా, ఎండీ యాసిన్, ఎండీ ముజీబ్ పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

● పోలవరం: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మసీదు కమిటీ ప్రార్థనలు, పురవీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎండి యాసీన్ షరీఫ్ మాట్లాడుతూ మదీనా పట్టణానికి మహరాజు దేవ ప్రవక్త మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని జరుపుకునే పండుగను మిలాద్ ఉన్ నబి అంటారని తెలిపారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శాంతి ర్యాలీ నిర్వహించారు. సంధాని, షేక్ సలీం, మహమ్మద్ బాషా, జిలానీ ముస్లిం పెద్దలు, యువకులు, బాలలు పాల్గొన్నారు.

ముగిసిన టీచర్ల ఆటల పోటీలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 16: యూటీఎఫ్ స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఇండోర్ స్టేడియంలో రెండు రోజులపాటు ఉపాధ్యాయులకు నిర్వహించిన జిల్లా స్థాయి ఆటలపోటీలు సోమవారం ముగిశాయి. 45 ఏళ్లలోపు పురుషులు, మహిళలకు వివిద విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. తొలి మూడుస్థానాల్లో విజేతలుగా నిలిచిన టీచర్ల జాబితాను సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఅలీ, రవికుమార్ విడుదల చేశారు. జిల్లాస్థాయి ఆటల పోటీల విజేతలను అక్టోబరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని వారు తెలిపారు.

హిందీ ఉపాధ్యాయుడికి అంతర్జాతీయ పురస్కారం

కామవరపుకోట, సెప్టెంబరు 16: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్ పోరంకి నాగరాజుకు అంతర్జాతీయ పురస్కారం లభించినట్టు ఆయన సోమవారం తెలిపారు. నేపాల్ లుంబినీలో నిర్వహించిన అంతర్జాతీయ హిందీ దినోత్సవ కవితా పోటీలో హిందీ కావ్యరత్న గౌరవ బిరుదుతో సత్కరించినట్టు ఆయన తెలిపారు. శబ్ద ప్రతిభ బహుళ ప్రాంతీయ సత్కార ఫౌండేషన్ నేపాల్ అధ్యక్షులు ఆనందగిరి మాయాలు, కార్యదర్శి చెరణ కౌర్ నుంచి పురస్కారం అందించారని, ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ అందజేశారని తెలిపారు. పోటీలో 6742 మంది కవులు పాల్గొన్నారని, 675 మంది అత్యుత్తమ కవితలు రాసిన వారిని ఎంపిక చేసి సత్కరించారన్నారు. నాగరాజుకు ఎంపీడీవో కె.శ్రీదేవి, ఎంఈవో డి.సుబ్బారావు, సీహెచ్.ప్రశాంత కుమార్, హెచ్ఎం పి.గసబాబు, ఎస్ఎంసి ఛైర్మన్ బొబ్బిలి డాన్ దివాకర్, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

గన్నికి ఎమ్మెల్యే మద్దిపాటి పరామర్శ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 16: టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మామ మండా సత్యనారాయణ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పరామర్శించారు. మండలంలోని పంగిడిగూడెంలో ఆయన స్వగృహానికి మండల పార్టీ నేతలతో కలసి వెళ్లి ముందుగా గన్ని వీరాంజనేయులుకు, ఇతర కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నేతలు లంకా సత్తిపండు, పోలిన శ్రీనివాసరావు, ఏపూరి దాలయ్య, ముళ్లపూడి దొరాజీ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **జీలుగుమిల్లి :** జనసేన మండల కార్యదర్శి వీరంకి వెంకటేశ్వరావుపై ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. పార్టీ కార్యకలాపాల్లో గొడవలు సృష్టించడం, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తించడం, కార్యకర్తలను బెదిరించే చర్యలకు దిగడంతో వెంకటేశ్వరావును పార్టీనుంచి తొలగించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.
- **చింతలపూడి :** కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌సవరణ బిల్లు చేయడానికి జాయింట్ పార్లమెంట్ కమిటీ నియమించిందని, ఇది కేవలం మతపరమైన రాజకీయం చేయటంకోసం జరుగుతున్న ప్రయత్నమని, దీన్ని అందరూ వ్యతిరేకించాలని రాష్ట్ర జమాతేఇస్లామీహింద్ అధ్యక్షుడు ఎండీ రఫీద్ పిలుపునిచ్చారు. చింతలపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దేశ సమైక్యత, స్వేచ్ఛ సమానత్వం, మహిళల హక్కులు కాపాడాలని, వక్ఫ్ ఆస్తులను పూర్వం సంపాదించుకున్న ఆస్తులు దానం చేసినవని దీనికి సవరణ బిల్లు పెట్టడం సమంజసం కాదన్నారు.
- **ద్వారకాతిరుమల :** విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ద్వారకాతిరుమలలో మంగళవారం జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు ఆహ్వానించారు. నల్లజర్లలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలంయానికి వెళ్లిన నేతలు ముందుగా ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉత్సవ బ్రోచర్‌ను అందజేశారు. లంకా సత్యనారాయణ, పోలిన శ్రీనివాసరావు, ఏపూరి కిశోర్, తదితరులు ఉన్నారు.
- **పెదపాడు :** వరద బాధితుల సహాయార్థం యలమంచిలి నాగేశ్వరరావు, కుటుంబసభ్యులు 160 కుటుంబాలకు దుప్పట్లను సోమవారం అందించినట్లుగా కొణికి సర్పంచ్ పొట్లూరి యుగంధర్ తెలిపారు. సత్యవోలు ఎంపీటీసీ రంభా నాగరాజు, గంపా వంశీ, లంక విష్ణు వరప్రసాదరావు, లంకపల్లి నాగరాజు, గుండపనేని కిశోర్ పాల్గొన్నారు.
- **జంగారెడ్డిగూడెం :** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియం తొలగింపు నిర్ణయంపై టీడీపీ సీనియర్ నాయకుడు మండవ లక్ష్మణరావు హర్షం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలు పోడియం ముందు నిలబడవలసి వచ్చేదన్నారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలను కూర్చోబెట్టి మంచినీరు, టీ ఇచ్చి అందరితో సమానంగా కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు చేయనుండడం శుభసూచకమన్నారు.

సంప్రదాయబద్ధంగా..
మిలాద్ ఉన్ నబీ



ముదినేపల్లి, సెప్టెంబరు 16 : మిలాద్ - ఉన్ - నబి పండుగను సోమవారం ముదినేపల్లి మండలంలో ముస్లింలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ముదినేపల్లిలోని మసీదులో ముస్లింలు నమాజ్‌లు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ బాజీ, నాయకులు సిద్దిక్, సలాం, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు అల్లా భక్షు తదితరులు పాల్గొన్నారు. సంకర్షణపురంలో టీడీపీ నాయకుడు మజీద్ హుస్సేన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



మంకొల్లు వద్ద రోడ్డు పక్కన ప్రమాదకర గొయ్యి

పొంచి ఉన్న ప్రమాదం

చాట్రాయి, సెప్టెంబరు 16: విస్సన్నపేట-చింతలపూడి ఆర్అండ్‌బీ రహదారిలో మంకొల్లు వద్ద, తమ్మిలేరు రెగ్యులేటర్ బ్రిడ్జి పక్కనే రోడ్డు అంచులో ప్రమాదకరమైన గొయ్యి వాహన చోదకులను వణికిస్తున్నది. భారీ వర్షాలకు రోడ్డు తమ్మిలేరులోకి జారిపోయింది. ప్రమాదవశాత్తు ఇక్కడెవరైనా జారితే 30 అడుగుల లోతులో పడిపోయే ప్రమాదం ఉంది. దగ్గరకు వచ్చే వరకు ఈ గొయ్యి కన్పించటం లేదు. రాత్రి సమయాల్లో ఏదైనా వాహనం ఎదురుగా వచ్చి పక్కకు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తక్షణం గొయ్యి పూడ్చి ప్రమాదాలు నివారించాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొమ్ము ఆనందం విజ్ఞప్తి చేశారు.

లంక గ్రామాలకు బస్సులు పునరుద్ధరించరూ..



కలిదిండి, సెప్టెంబరు 16 : మండలంలో లంక గ్రామాలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరిం చాలని పలువురు కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లంక గ్రామాల ప్రధాన రహదారి గుంతలు పడి ఛిద్రమవ్వటంతో బస్సులను నిలుపుదల చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో కూటమి నాయకులు, రైతులు స్వచ్ఛందంగా లంక గ్రామాల ప్రధాన రహదారికి గుర్వాయిపాలెం నుంచి పెదలంక వరకు 15 కిలోమీటర్ల మేర మరమ్మతులు చేయించారు. భీమవరం, గుడివాడ, విజయవాడ, ఏలూరు నుంచి ఆర్టీసీ బస్సులు గతంలో ప్రతి రోజూ లంక గ్రామాలకు రాకపోకలు సాగించేవి. రహదారికి మరమ్మతులు చేసినప్పటికీ విజయవాడ డిపోకి చెందిన పల్లెవెలుగు బస్సుతోపాటు పలు బస్సులు వారం రోజులుగా రావటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సులు లేక ఆటోలకు డిమాండ్ పెరిగి అధిక ధరలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భీమవరం, గుడివాడ, విజయవాడ డిపో బస్సులు లంక గ్రామాలకు వెళ్లకుండా కలిదిండి నుంచి వెనుదిరగడంతో అవస్థలు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి లంక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్..

కొట్లాటకు దారితీసిన వివాదం

ముదినేపల్లి, సెప్టెంబరు 16 : ఆటో స్పేర్ పార్ట్‌ల గ్యారెంటీ విషయంలో ఇరు వర్గాల మధ్య ఏర్పడిన వివాదం కాస్తా కొట్లాటకు దారి తీయగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఏఎస్ఐ పద్మజ కథనం ప్రకారం ముదినేపల్లికి చెందిన ఎం.రవికుమార్, దుర్గారావు, మండవల్లి మండలం అయ్యగారి రుద్రవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ముచ్చు పాపారావుతోపాటు మరో ముగ్గురు వ్యక్తులకు మధ్య సోమవారం ముదినేపల్లిలో ఆటో స్పేర్ పార్ట్స్ గ్యారెంటీ విషయమై షాపు వద్ద వివాదం తలెత్తింది. దుర్గారావు తాను అమ్మిన స్పేర్ పార్ట్స్‌కు 6 నెలల గ్యారెంటీ ఇవ్వగా, ఐదు నెలలలోపే అవి పాడైపోయాయంటూ పాపారావు తగాదా పడ్డాడు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. ఆ సమయంలో పాపారావు, మరో నలుగురు రెచ్చిపోయి దుర్గారావును, అడ్డు వచ్చిన ఫణీంద్రపై దాడి చేసి గాయపరిచారు. ముదినేపల్లి ఏఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్స్‌కవేటర్, టిప్పర్ స్వాధీనం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 16: సిద్ధార్థనగర్‌లో అక్రమంగా మట్టి తోలకాలు చేస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను నూజివీడు తహసీల్దార్ సుబ్బారావు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కలెక్టర్‌కు అందిన సమాచారంతో సిద్ధార్థ నగర్‌లో మట్టి తోలకాలను అడ్డుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు. మరో టిప్పర్ ఉడాయించింది. దీనిపై నూజివీడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.



ఊటుకూరు డ్రెయిన్‌లో పేరుకుపోయిన కిక్కిస



ఊటుకూరులో పొలాల్లో తగ్గని ముంపు

ముంచిన కిక్కిస

తగ్గని ముంపు.. కుళ్లుతున్న వరి పైరు
ఊటుకూరు డ్రెయిన్‌లో పెరిగిన కిక్కిస
ఏటా నష్టపోతున్న అన్నదాత
రెండేళ్లుగా పెండింగ్‌లోనే ప్రతిపాదనల ఫైళ్లు

ముదినేపల్లి, సెప్టెంబరు 16 : ఊటుకూరు మీడియం డ్రెయిన్‌లో పెద్ద ఎత్తున పెరిగిన కిక్కిసను తొలగించకపోవటంతో వరుసగా రెండో ఏడాది కూడా వర్షాల వల్ల వరి పంటకు భారీ నష్టం ఏర్పడింది. ఇటీవలి భారీ వర్షాలకు ముంపునకు గురైన వందలాది ఎకరాల్లోని వరి పైరు నేటికీ తేరుకోలేదు. నీట మునిగిన వరి నీటిలోనే కుళ్లిపోతుండగా, ఈ డ్రెయిన్‌లోని కిక్కిస తొలగింపునకు నిధుల కోసం డ్రెయినేజీ శాఖ అధికారులు ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు గత రెండేళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ డ్రెయిన్‌లో ఊటుకూరు నుంచి వైవాక శివారు వరకు సుమారు 5 కిలోమీటర్లు చిట్టడవిలా పేరుకుపోయిన కిక్కిసను యంత్రాలతో తొలగించేందుకు నిధులు మంజూరు చేయటంలో జరుగుతున్న జాప్యం కారణంగా భారీ వర్షాలకు దేవపూడి, వణుదుర్రు, నారాయణపురం, కొత్తపల్లి, ఊటు కూరు, మలపరాజు గూడెం గ్రామాలకు చెందిన సుమారు 1300 ఎకరాల్లో వరి పైరు పూర్తిగా ముంపులోనే ఉండిపోయింది. గత ఏడాది కూడా వెయ్యి ఎకరాల్లో పంట చేతికి దక్కలేదు. ఇప్పటికైనా ఈ డ్రెయిన్ కింది భాగంలో పెరిగిన కిక్కిసను తొలగిస్తే ముంపు బారిన పడిన పొలాలే కాకుండా మరో 800 ఎకరాల్లో పాక్షికంగా ముంపునకు గురైన ఆయకట్టు నుంచి వరి పంటను కాపాడుకోవచ్చునని పలు గ్రామాల రైతులు చెబుతున్నారు.

కిక్కిస తొలగిస్తేనే పంట దక్కేది



ఊటుకూరు మీడియం డ్రెయిన్‌లో కిక్కిస తొలగించాలని ఏళ్ల తరబడి వేడుకుంటున్నాం. డ్రెయిన్ కింది భాగంలో కిలోమీటర్ల మేర పెరిగిన కిక్కిస నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉంది. ముంపు వల్ల సుమారు 1300 ఎకరాల్లో పంట దెబ్బతింది. వెంటనే తొలగిస్తే మిగిలిన భూముల్లో పంట దక్కుతుంది.
- పోసిన పాండురంగారావు, రైతు, ఊటుకూరు.



చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు

తమ్మిలేరు అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు

చాట్రాయి, సెప్టెంబరు 16: మండలంలోని చిన్నంపేట, చింతలపూడి మండలం శివపురం గ్రామాల మధ్య తమ్మిలేరుపై ఉన్న కాజ్‌వే అప్రోచ్ రోడ్డుకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఇటీవల తుఫానుకు తమ్మిలేరుకు వరద పోటెత్తి అప్రోచ్ రోడ్డుకు గండి పడిన విషయం విదితమే. మండల పరిషత్ నుంచి రూ. 2 లక్షల నిధులు మంజూరు కాగా, జిల్లా టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. మరో 2 రోజుల్లో అప్రోచ్ రోడ్డును పటిష్ఠంగా నిర్మించి ప్రజల ఇబ్బందులు పరిష్కరిస్తామని అత్తులూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల రైతులకు చింతలపూడి మండలంలో, అక్కడి రైతులకు ఇక్కడ వ్యవసాయ భూములు ఉండటంతో నిత్యం పెద్ద సంఖ్యలో రైతులు, కూలీలు, పశువులు కాజ్‌వే మీదుగా రాకపోకలు సాగిస్తారు. శివపురానికి చెందిన 200 మంది విద్యార్థులు చిన్నంపేట స్కూల్స్‌లో చదువుతున్నారు. మండలంలోని ఏటి ఒడ్డు గ్రామాల ప్రజలు వైద్యం కోసం చింతలపూడి ఆస్పత్రులకు వెళుతుంటారు. ఐదారు గ్రామాల నుంచి విద్యార్థులు చింతపూడి కళాశాలల్లో చదువుతున్నారు. కాజ్‌వేకి గండి పడి రాకపోకలు ఆగిపోవటంతో వీరంతా ఇబ్బందులు పడ్డారు. కాజ్‌వే అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టంతో రెండు మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు



కైకలూరు, సెప్టెంబరు 16: తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురైన గ్రామాల్లో నీరు తగ్గడంతో దోమల నిర్మూలన చర్యలను చేపట్టారు. సోమవారం కైకలూరు మండలం ఆచవరంలో సర్పంచ్ కట్టా నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో మలాథియాన్‌ను పిచికారీ చేశారు. వర్షాలకు గ్రామాల్లో నీరు నిల్వ ఉండి గత పది రోజులుగా రోడ్లు ముంపులో ఉన్నాయి. క్రమేపీ నీరు తగ్గడంతో ఒకవైపు పారిశుధ్య పనులు, మరోవైపు దోమల మందును పిచికారీ చేస్తున్నారు.

నిమ్మ రైతులను ఆదుకోవాలి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 16: మార్కెట్‌లో ధర ఉన్నా దిగుబడిలేక నిమ్మరైతు నష్టాల్లో ఉన్నాడని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. పంగిడిగూడెంలో రైతు సంఘనేతలు పర్యటించి నిమ్మ తోటలను పరిశీలించారు. నిమ్మ రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత ఆయన మాట్లాడుతూ ఎర్రనల్లి, తెల్లదోమ వంటి తెగుళ్ల వల్ల నిమ్మ దిగుబడి బాగా తగ్గిందని, ధర పెంచినట్లు ప్రచారం చేయడం వల్ల రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు.

హిందీ ఉపాధ్యాయుడికి అంతర్జాతీయ పురస్కారం

కామవరపుకోట, సెప్టెంబరు 16: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్ పోరంకి నాగరాజుకు అంతర్జాతీయ పురస్కారం లభించినట్టు ఆయన సోమవారం తెలిపారు. నేపాల్ లుంబినీలో నిర్వహించిన అంత ర్జాతీయ హిందీ దినోత్సవ కవితా పోటీలో హిందీ కావ్యరత్న గౌరవ బిరుదుతో సత్కరించినట్టు ఆయన తెలిపారు. శబ్ద ప్రతిభ బహుళ ప్రాంతీ య సత్కార ఫౌండేషన్ నేపాల్ అధ్యక్షులు ఆనందగిరి మాయాలు, కార్యదర్శి చెరణ కౌర్ నుంచి పురస్కారం అందించారని, ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ అందజేశారని తెలిపారు. పోటీలో 6742 మంది కవులు పాల్గొన్నారని, 675 మంది అత్యుత్తమ కవితలు రాసిన వారిని ఎంపిక చేసి సత్కరించారన్నారు. నాగరాజుకు ఎంపీడీవో కె.శ్రీదేవి, ఎంఈవో డి.సుబ్బారావు, సీహెచ్.ప్రశాంత కుమార్, హెచ్ఎం పి.గసబాబు, ఎస్ఎంసి చైర్మన్ బొబ్బిలి డాన్ దివాకర్, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.



కొవ్వాడలంకలో బాధితులకు కూరగాయల పంపిణీ

'జాగృతి' కూరగాయల వితరణ

మండవల్లి, సెప్టెంబరు 16: మండవల్లి మండలంలో కొవ్వాడలంక, పెనుమాకలంక, ఇంగిలిపాకలంక గ్రామాల్లో కైకలూరు జాగృతి విద్యాసంస్థల అధినేత పానెం కిషోర్ సారథ్యంలో వరద ముంపు ప్రాంతాల్లో రూ.50 వేలు విలువ చేసే కూరగాయలను సోమవారం పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు వీరాబత్తిన సుధా, జక్కుల విజయ్‌కుమార్, సర్పంచ్ జయమంగళ తిరుపతి వెంకన్న, మధు, పానెం కిరణ్, జాగృతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీకి విద్యుత్ సామగ్రి వితరణ

ముసునూరు, సెప్టెంబరు 16: కొర్లకుంట పంచాయతీ శివారు సింహాద్రి అప్పారావుపేటలో ని అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించిన సర్వీస్ వైర్, ఇతర సామగ్రిని టీడీపీ నేత పొట్లూరి మహేంద్ర వర్మ, లక్ష్మీప్రసన్న దంపతులు సోమవారం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి ఉన్న సర్వీస్ వైర్ పూర్తిగా పాడైపోవడంతో విద్యుత్ సౌకర్యానికి ఆటంకం ఏర్పడడంతో ఈ సమగ్రిని దాతలు అంగన్‌వాడీ కార్యకర్త మందపాటి కస్తూరికి అందజేశారు. కూటమి నాయకులు వై. శివనాగేంద్ర, పొట్లూరి వాసుదేవరావు, గోళ్ళ వెంకటరామయ్య, జొన్నలగడ్డ శ్రీను, పి.రంగరావులు పాల్గొన్నారు.



శ్రీశ్యామలాంబ ఆలయంలో రాట ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

దసరా మహోత్సవాలకు రాట ప్రతిష్ఠ

కైకలూరు, సెప్టెంబరు 16: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రాటప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. కైకలూరు ప్రముఖులు నంబూరి ప్రతాపరాజు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించి రాటను ప్రతిష్ఠించారు. వచ్చే నెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా ఉత్సవాలను నిర్వహించనున్నారు. ప్రతిరోజు అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అక్టోబరు 3న బాలాత్రిపురసుందరి, 4న ధనలక్ష్మి, 5న ధాన్యలక్ష్మి, 6న రాజరాజేశ్వరి, 7న కాశీఅన్నపూర్ణగా, 8న గాయత్రీదేవి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవీ, 11న శ్రీపార్వతీదేవీ, 12న శ్రీమహిషాసురమర్దిని, 13న పుష్పశయన అలంకారంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ తెలిపారు. ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గోగులంపాడు ప్రధాన రహదారి గండిని పూడ్చిన దృశ్యం

రహదారిపై గండి పూడ్చివేత

ముసునూరు, సెప్టెంబరు 16: మంత్రి ఆదేశాలు బేఖాతర్.. ప్రధాన రహదారిపై గండిని పూడ్చని అధికారులు శీర్షికన ఈ నెల 14న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎర్రకాలువ వరద ఉధృతికి గోగులంపాడు - అక్కిరెడ్డిగూడెం ప్రధాన రహదారిలో పడిన గండికి రెండు రోజులుగా పూడ్చివేత పనులు చేపట్టారు. సుమారు మూడు లైన్లుగా 20 సిమెంట్ తూరలు వేసి, వాటిపై గ్రావెల్‌తో బలోపేతం చేశారు. దీంతో రెండు వారాలుగా తీవ్ర ఇబ్బందులు పడిన వాహనదారులు, ఇరు గ్రామాల ప్రజలు 'ఆంధ్రజ్యోతి' కథనంతో సమస్య పరిష్కారం కావడంతో హర్షం వ్యక్తం చేశారు.

నేడు కలిదిండిలో ఉచిత మెగా వైద్య శిబిరం

కలిదిండి, సెప్టెంబరు 16 : కలిదిండిలో మంగళవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆంధ్ర, తెలంగాణ రాధా - రంగా మిత్రమండలి అధ్యక్షుడు పన్నాస పూర్ణచంద్రరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. శిబిరాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభిస్తారన్నారు. విజయవాడ స్వర ఆసుపత్రి నిర్వహించే ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అందుబాటులో కామినేని

కైకలూరు, సెప్టెంబరు 16: ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం నుంచి కైకలూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు కలిదిండిలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారు. 4 గంటలకు ప్రధాన మంత్రి నిధులతో నిర్మించిన గృహ ప్రవేశాల్లో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటల నుంచి కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 18న విజయవాడలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని 19వ తేదీ ఉదయం 10 గంటలకు కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 4 గంటలకు కలిదిండిలో ఏర్పాటుచేసిన రైతుల సమావేశంలో పాల్గొంటారని, ఈ నెల 20 వరకు విజయవాడ వరద బాధితుల కోసం విరాళాలు సేకరించనున్నట్లు ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

ముదినేపల్లి, సెప్టెంబరు 16 : భారీ వర్షాల అనంతరం గ్రామాల్లో ఏర్పడిన అపరిశుభ్రత కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలను నిర్వహించాలని తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు కోరారు. పారిశుధ్య చర్యలపై వివిధ శాఖల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో పలు చోట్ల మురుగునీటి నిల్వలు తరలించాలని, తాత్కాలిక డ్రెయిన్లను పంచాయతీ అధికారులు తవ్వించాలని, ఇప్పటికే సాధారణ జ్వరాలు సోకుతున్నందున వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 16: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ఉద్దేశించి చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నూజివీడు ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్ కోరారు. నూజివీడు మండలంలోని 29 గ్రామాల పరిధిలో మంగళవారం నుంచి 15 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని 11 మంది మండల స్థాయి అధికారులను పర్యవేక్షక అధికారులుగా నియమించినట్టు చెప్పారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో మంగళవారం నుంచి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో జి.రాణి తెలిపారు. మండల స్థాయి అధికారులను గ్రామాల్లో జరిగే కార్యక్రమాలు పర్యవేక్షించేందుకు నోడల్ అధికారులుగా నియమించినట్టు ఎంపీడీవో తెలిపారు. జిల్లా పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల ప్రణాళిక ప్రకారం ప్రతి గ్రామంలో కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

కలిదిండి: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో దినతేజ్ సోమవారం ప్రకటనలో కోరారు. గ్రామాల్లో మంగళవారం నుంచి 15 రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

దాకరం గ్రామ ప్రముఖులు సరళాదేవి మృతి



ముదినేపల్లి, సెప్టెంబరు 16 : ముదినేపల్లి మండలం దాకరం గ్రామ ప్రముఖురాలు దుక్కిపాటి సరళాదేవి (80) సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆమె గ్రామ పాల ఉత్పత్తిదార్ల సంఘ అధ్యక్షురాలిగా చాలా కాలం వ్యవహరించి సంఘ అభివృద్ధికి కృషి చేశారు. ఆమె భర్త, టీడీపీ నాయకుడు దివంగత దుక్కిపాటి సింహాద్రి అప్పారావు, ముదినేపల్లి మండల పరిషత్ తొలి అధ్యక్షుడిగా వ్యవహరించగా, కుమారుడు దుక్కిపాటి శ్రీనివాస్ సర్పంచ్‌గా వ్యవహరించారు. ఆమె మృతి పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, దాకరం సర్పంచ్ జాస్తి రాజా తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

దోనేపూడి శ్రీనివాస్‌కు నివాళి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 16: గొల్లపల్లి గ్రామంలో రహదారి ప్రమాదంలో మృతి చెందిన జనసేన కార్యకర్త దోనేపూడి శ్రీనివాసరావు పార్థివదేహాన్ని జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ, నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జనసేన నాయకులు యర్రంశెట్టి రాము, ఎం.సునీల్ కుమార్, బందారు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నేలబావి



ముసునూరు, సెప్టెంబరు 14: ముసునూరు ప్రధాన కూడలిలోని నేలబావి నిరుపయోగంగా మారి ప్రమాదకరంగా ఉంది. బావి కొన్ని సంవత్సరాల నుంచి వాడుకలో లేకపోవడం, అందులో పలువురు చెత్తాచెదారం వేయటం వల్ల దుర్వాసన వెదజల్లడంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ బావిలో అనేక మంది ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రధాన కూడలిలో ఉన్న ఈ నేలబావి అత్యంత ప్రమాదకరంగా ఉందని చుట్టుపక్కల ప్రజలు వాపోతున్నారు. దీనిని పూడ్చివేసేలా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.











ముసునూరు,పెదగొన్నూరు, కోటపాడు, పేట కలిదిండిలో గణనాథుల ఊరేగింపు.. మిట్టగూడెంలో లడ్డూ దక్కించుకున్న వెలివెల

గణపయ్యకు వీడ్కోలు

ఘనంగా నిమజ్జనాలు.. అన్నసమారాధనలు
వేలంలో భారీ ధర పలికిన లడ్డూ ప్రసాదాలు

ముసునూరు, సెప్టెంబరు 16: ముసునూరు పోలీస్ స్టేషన్ సమీపంలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహాగణపతి నిమజ్జన ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి లడ్డూ ప్రసాదాలకు వేలం నిర్వహించగా 13 కేజీల లడ్డూను పేరం కాసులు రూ. 13 వేలకు, 6 కేజీల లడ్డూను వెంకటేశ్వరరావు రూ. 13,100కు, 3 కేజీల లడ్డూను సుంకర రవి రూ. 5,100కు దక్కించుకున్నారు. కమిటీ చైర్మన్ మంగిశెట్టి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. అనంతరం స్వామి నిమజ్జనం మేళ తాళాలతో వైభవంగా నిర్వహించి నిమజ్జనం చేశారు. కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

చాట్రాయి: మండలంలోని చాట్రాయి, కోటపాడు, చిత్తపూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను సోమవారం తీన్మార్ వాయిద్యాలు, మహిళల భక్తి గీతాలు, యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ వైభవంగా ఊరేగించారు. చాట్రాయి, పోలవరం, చిత్తపూరు గ్రామాల్లోని గణేష్ పందిళ్ళలో భారీ అన్నసమారాధనలు జరిగాయి.

రికార్డు ధర పలికిన గణేష్ లడ్డూలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 16: నూజివీడు పట్టణ, మండల ప్రాంతాల్లోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల వద్ద ప్రసాదంగా ఉంచిన లడ్డూలు వేలంలో రికార్డు ధర పలికాయి. ఆదివారం రాత్రి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రసాదం లడ్డూలను వేలం వేయగా నూజివీడు మండలం మిట్టగూడెంలో గ్రామ ప్రముఖుడు వెలివెల సీతారామయ్య రూ.2,70,999లకు లడ్డూను దక్కించుకున్నారు. మరో లడ్డూను గ్రామానికి చెందిన మట్టా సహదేవుడు రూ.1,10,000కు పాడగా పోతిరెడ్డిపల్లిలో స్వామివారి లడ్డూను అక్కినేని ప్రేమ్‌కుమార్, అక్కినేని రాజా మిత్ర బృందం రూ.1,75,116లకు, సిద్దార్థ నగర్‌లో లడ్డూను గోపి రూ.1.50 లక్షలకు పాడారు. నిమజ్జన ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు.

ముదినేపల్లి: మండలంలో నిమజ్జనోత్సవాలు సోమవారం కోలాహలంగా జరిగాయి. పెదగొన్నూరులో శాలివాహన సంఘీయుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. అదే గ్రామంలోని మరో రెండు చోట్ల ప్రతిష్ఠించిన విగ్రహాల నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. అర్చకుడు లంక వెంకటేశ్వర బాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. బొమ్మినంపాడు, వాడవల్లి, ముదినేపల్లి, గురజ, వడాలి తదితర గ్రామాల్లో నిమజ్జనోత్సవాలు, అన్నసమారాధనలు జరిగాయి.

కలిదిండి: చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను సోమవారం ఊరేగింపుగా నిమజ్జనాలకు తరలించారు. పేట కలిదిండిలో ఏర్పాటు చేసిన స్వామి వారిని, బర్రింకల గరువు వద్ద గల గణనాథుని పురవీధుల్లో మేళతాళాలతో ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. కమిటీల సభ్యులు పాల్గొన్నారు.